విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా
బుధవారం, 13 ఆగస్టు 2025 | 8 పేజీలు

ఉద్రిక్తతల నడుమ ఉప ఎన్నికలు

- స్వేచ్ఛగా ఓటు వినియోగించుకున్న ఓటర్లు
- చేతులెత్తేసిన వైసిపి

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల జెడ్పీటీసీ ఉపఎన్నిక ఉద్రిక్తల నడుమ ప్రశాంతంగా ముగిసింది. ప్రజలు కూడా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద సిసి, డ్రోన్ కెమెరాలను పోలీసులు ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 7గంటల నుంచే ఓటు వేసేందుకు ఓటర్లు బారులు తరారు. 2లో

జెడ్పీటీసి స్థానాలు టిడిపివే

- సీఎంకు కానుకగా ఇస్తాం
- మంత్రి రాంప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: జిల్లాలో నిర్వహించిన రెండు జడ్పీటిసి స్థానాలను టిడిపి కైవసం చేసుకుంటుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ..మిగతా 2లో

రాజ్యాంగం గురించి మాట్లాడే హక్కు

అవినాష్‌రెడ్డికి లేదు

- ఉప ఎన్నికల్లో కూటమిదే విజయం
- మంత్రి సవిత ధీమా

విశాలాంధ్ర-పులివెందుల: భారత రాజ్యాంగం గురించి హక్కు ఎంపీ అవినాష్‌రెడ్డికి లేదని మంత్రి సవిత స్పష్టం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ..మిగతా 2లో

ప్రజాస్వామ్యం ఖూనీ

- ఇంత చెత్త ఎన్నికలు ఎన్నడూచూల్లేదు - ఎంపీ అవినాష్ రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందులలో ప్రజాస్వామ్యం ఖూనీ, ప్రజాస్వామ్యం ఉందా.. ఉంటే డీఐజీ, ఎస్పీలు టిడిపి కార్యకర్తల లాగా పనిచేశారని ఎంపీ అవినాష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పోలింగ్ సరళి సీసీ ఫుటేజీలు అభ్యర్థులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2లో

ఓటమి భయంతోనే

వైసీపీ డ్రామాలు

- టిడిపి అభ్యర్థి లతారెడ్డి

2లో

అరెస్టు అన్యాయం

- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

2లో

జడ్పీటిసి ఉప ఎన్నికల్లో తీవ్ర ఉద్రిక్తత

- పోలింగ్ కేంద్రాలలో టిడిపి, వైసిపి నేతల మధ్య ఘర్షణ
- వైసిపి నేతలపై మండిపడిన మంత్రి మండిపల్లి
- పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించిన సంయుక్త కలెక్టర్, డిఐజి

విశాలాంధ్ర-కడప బ్యూరో: అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం జరిగిన జడ్‌పిటిసి ఉప ఎన్నికల పోలింగ్ కూడ తీవ్ర ఉద్రిక్తతల మధ్య కొనసాగింది. ఈ ఎన్నికను వైసిపి, తెదేపా ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇరుపార్టీల నాయకులు కొత్త మాధవరం, చిన్న కొత్తపల్లి, పెన్నరేరూరు, గొల్లపల్లి, సలాబాద్, నడింపల్లి, గాండ్లపల్లి, మంటపంపల్లి పోలింగ్ కేంద్రాల వద్ద మొహరించడంతో ఉద్రిక్తత చోటు చేసుకొంది. ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమక్షంలోనే తెలుగుదేశం పార్టీ

నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయి వైసిపి నాయకులు ఏజెంట్లపై దాడులకు పాల్పడ్డారు. ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఇన్‌ఛార్జ్‌గా వున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమక్షంలోనే పలు పోలింగ్ కేంద్రాల్లో తెదేపా నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయి వైసిపి నాయకులు, ఏజెంట్లపై దాడులకు పాల్పడ్డారు. 2లో

ఉప ఎన్నిక ప్రశాంతం

- కలెక్టర్ చెరుకూరు శ్రీధర్

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీస ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని కలెక్టరు చెరుకూరు శ్రీధర్ పేర్కొన్నారు. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల సరళిని 2లో

జిల్లా సమగ్రాభివృద్ధికి

ప్రత్యేక నిధులు కేటాయించాలి

- జిల్లా వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న నీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి
- కడప బెంగుళూరు రైల్వే లైను పనులు పునప్రారంభించాలి
- హార్సిలీహిల్స్‌పై అంగుళం స్థలం బాబాకి ఇచ్చిన పోరాటం తప్పదు
- చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ పనులు వెంటనే పూర్తి చేయాలి
- బీటీ కళాశాల ఆస్తులను పరిరక్షించి కళాశాలను అభివృద్ధి చేయాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి మహేష్

4లో

- ఇష్టారీతిన మద్యం అమ్మకాలు..
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు..

గ్లాసులు గలగల.. నిబంధనలకు తూట్లు..

విశాలాంధ్ర-యర్రగుంట్ల: మద్యం దుకాణాల వద్ద నిబంధనలు గాలికి వదిలేస్తున్నారు. ఎక్కడికక్కడ దుకాణాల్లో మద్యం సేవించి రోడ్లపైన వీరంగం చేస్తున్నా పట్టించుకునే నాధుడే లేడు. మద్యం దుకాణాల వద్ద విడి అమ్మకాలతో పాటు వెనుక అనధికారికంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ పొగాకు ఉత్పత్తులు ఆహార పదార్థాలు గ్లాసులు, మంచినీటి ప్యాకెట్లు, చిరుతిళ్లు, బిర్యాని, ఫాస్ట్ ఫుడ్ వంటివి విక్రయించకూడదని నిబంధనలు చెబుతున్నా ఎక్కడ పాటించడం లేదు. ఈ ప్రాంతంలోని చాలా దుకాణాల వద్ద బార్ మాదిరి అనధికారిక గదులు ప్రారంభించడం, రెస్టారెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. మద్యం విడి అమ్మకాల వల్ల కల్తీ కి ఆస్కారం ఉంది .అయినా ఎక్కడ తగ్గేదేలే అన్నట్లుగా విడివిక్రయాలు సాగుతున్నాయి. మద్యం గొలుసుకట్టు దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో, వీధుల్లో విడిమద్యం 130ఎంఎల్‌పై రూ.30 నుంచి రూ.40 అధిక ధరలకు ..మిగతా 4లో

హెచ్ఐవిపై యువత అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు

విశాలాంధ్ర-పులివెందుల: మత్తు, హెచ్ఐవిపై యువత అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. పులివెందుల పట్టణం లోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి లో మంగళవారం నిర్వహించిన హెచ్ఐవి, మాదక ద్రవ్యాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టబోతున్న మాసోత్సవాల కార్యక్రమం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు, ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌లు ప్రారంభించారు. ..మిగతా 4లో

రాజ్యాంగం గురించి మాట్లాడే హక్కు అవినాష్‌రెడ్డికి లేదు

మొదటి పేజీ తరువాయి

ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత పాలనంతా వైఎస్ రాజారెడ్డి రాజ్యాంగం నడిచిందని, ఇప్పుడు అంబేద్కర్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. సొంత బాబాయ్ వివేకానందరెడ్డిని గొడ్డలితో అతి దారుణంగా కిరాతకంగా నరికి చంపిన నీచ చరిత్ర వైఎస్ కుటుంబ సభ్యులదే అన్నారు. రాజారెడ్డి రాజ్యాంగాన్ని ప్రజలు తిరస్కరించి కూటమికి ప్రజలు పట్టంకట్టారన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తంచేశారు. కనంపల్లిలో రీపోలింగ్ జరపాలని కోరుతున్నారని ఓ విలేకరి ప్రశ్నించగా అక్కడ ప్రజలు ఎవ్వరూ కోరలేదని, కేవలం వైసిపి నాయకులు అడుతున్నారని సమాధానమిచ్చారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాటాడుతూ గతంలో వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం పరిరక్షించిందన్నారు. గత వైసిపి పాలనంతా అపద్దాలు, అరాచకాలు, అలజడులు సృష్టించి ప్రజల చేత ఛీ అనిపించుకున్నారన్నారు. 2011 ఎన్నికల్లో జగన్ పిసినారి తనాన్ని కళ్లారా చూశామన్నారు. బిటెక్ రవి ఆధ్వర్యంలో పులివెందుల ప్రాంత సమగ్రాభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామన్నారు. పులివెందుల జెడ్పీటీసీగా లతారెడ్డి గెలవబోతోందని, రాబోవు ఎన్నికల్లో కూడా బిటెక్ రవిని గెలిపించాలని ఆయన కోరారు. అరాచకాలు సాగిస్తున్న జగన్‌కు చెక్ పెట్టడమే లక్ష్యంగా ముందుకు వెళతామని ఆయన తెలిపారు. విలేకరు సమావేశంలో కడప టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి బిటెక్ రవిలు పాల్గొన్నారు.

జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో తీవ్ర ఉద్రిక్తత

మొదటి పేజీ తరువాయి

చిన్న కొత్తపల్లె గ్రామంలోని పోలింగ్ బూత్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. అక్కడ వైసిపి వారు దొంగ ఓట్లు వేసుకుంటున్నారని సమాచారం అందడంతో మంత్రి వెళ్లారు. మంత్రి సమక్షంలోనే తెదేపా కార్యకర్తలు రెచ్చి పోయి వైసిపి ఏజెంట్‌పై పిడి గుద్దులతో మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. వైసిపి ఏజెంట్లను తరిమివేసి రిగ్గింగ్ చేసుకున్నట్లు ఓటర్లు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో వైసిపి శ్రేణులు తిరగబడడంతో పోలీసులు మంత్రిని అక్కడి నుంచి బయటకు తీసుకెళ్లారు. వైసిపి ఏజెంట్లను పోలీసులు అక్రమంగా అరెస్టు చేస్తున్నారని కార్యకర్తలు వాపోయారు. గాండ్లపల్లి పోలింగ్ బూత్‌లో తెలుగుదేశం నాయకులు వైసిపి ఏజెంట్లను బయటకు తరిమి వేశారు. అలాగే టిడిపి జడ్పిటిసి అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి స్వంత గ్రామమైన మంటపంపల్లి పోలింగ్ కేంద్రంలో వైసిపి నాయకులు తెదేపా నాయకులపై దాడికి పాల్పడ్డారు. అలాగే వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి ఒంటిమిట్ట జడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలోకి చొచ్చుకుని వెలుతూ కుర్చీలు, బ్యారికేడ్లను తోసుకొంటూ వెళ్లడంతో పోలీసులు చెదరగొట్టారు. ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయ సమీపంలోని పోలింగ్ బూత్‌లో వైసిపి ఏజెంట్లను తెదేపా నాయకులు బయటకు లాగేశారని, ఒంటిమిట్ట ప్రధాన రహదారిలో వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రి ఎస్‌బి అంజాద్‌బాష, వైఎస్ఆర్‌సిపి జడ్పిటిసి అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి వీరితో పటు మరికొందరు వైసిపి నాయకులు ధర్నా నిర్వహించారు. దీంతో కడప తిరుపతి జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున ట్రాఫిక్ సంభవించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఒంటిమిట్ట పోలింగ్ కేంద్రాలలో అధికార పార్టీ నాయకులు అరాచకాలకు పాల్పడుతున్నారని, మంత్రిని ఇక్కడి నుంచి పంపివేయాలని డిమాండ్ చేశారు. డిఐజి కోయ ప్రవీణ్ సంఘటన స్థలానికి చేరుకొని వారితో చర్చించారు. అనంతరం రవీంద్రనాథ్ రెడ్డి, ఎస్‌బి అంజాద్‌బాషతో పాటు పలువురు కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి ఒంటమిట్ట పోలీసు స్టేషన్‌కు తరలించారు. వైసిపి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఇలాంటి ఎన్నికలు ఎక్కడా చూడలేదన్నారు. టిడిపి గూండాలు గ్రామాలు తిరుగుతూ స్థానికేతరులు గ్రామాల్లో తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. వైసిపి ఏజెంట్లను పోలీసుల సహాయంతో బయటకు పంపించడం చాలా దారుణమైన చర్య అన్నారు. ఇలాంటి ఎన్నికలు జరిగినా ఒకటే జరగక పోయినా ఒకటే అన్నారు. పోలీసు అధికారులు ప్రజలకు అండగా వుండాల్సింది పోయి టిడిపి గుండాలకు అండగా వుండడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా ఎన్నికల అధికారులు ఈ ఎన్నికలను రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి నాయకులు ఓడిపోతామనే భయంతో తెదేపా ఏజెంట్లపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయన్నారు. ఏది ఏమైనప్పటికీ ఒంటిమిట్ట మండలంలో జరిగిన ఉప ఎన్నిక చదురు ముదురు ఘటనల మినహా కొంతవరకు ప్రశాంతంగా జరిగిందని ఓటర్లు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

మొదటి పేజీ తరువాయి

మంగళవారం సాయంత్రం పట్టణంలోని అర్బన్ పోలీస్ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కూని చేసి, కర్నూల్ రేంజి డిఐజి కోయ ప్రవీణు, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, పోలీసులంతా టిడిపి కార్యకర్తలేనని ఆయన తీవ్రంగా విమర్శించారు. మంగళవారం జరిగిన పులివెందుల జెడ్పీటిసి ఉప ఎన్నికలలో వైసిపి ఏజెంట్లను బయటికి లాగేసి ఆయా గ్రామాలలో ప్రజలు ఓట్లు వేయాల్సి ఉండగా, అందుకు పోలీసులు ప్రభుత్వం కుమ్మక్కై అనంతపురం, జమ్మలమడుగు, కమలాపురం, ముద్దనూరు కొండాపురం, తొండూరు కడప ప్రాంతాల నుంచి టిడిపి కార్యకర్తలను ఎత్తున పులివెందులకు తరలించారన్నారు. వారే క్యూలైన్లలో ఉండి ఒక్కొక్కరు 10ఓట్లు వేశారని ఆయన ఆరోపించారు. ఈ దొంగ ఓట్లను అరికట్టాల్సిన డీఐజీ, ఎస్పీ, పోలీసుల సహకారంతో గ్రామ ఓటర్లను దగ్గరికి రానీయకుండా టిడిపి కార్యకర్తలే ప్రశాంతంగా ఓట్లు వేశారని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన రెండు నిమిషాల వెబ్బు సైట్‌లోనే 20మంది దొంగ ఓటర్లను, వారి పేర్లు అడ్రస్సులు మొత్తం ఆర్‌వోకు అందజేశామన్నారు. అలాగే 10గంటల పాటు జరిగిన ఎన్నికల వెబ్‌సైట్‌ను పోటీ బరిలో ఉన్న అభ్యర్థులకు సిసి ఫుటేజీలను ఇవ్వాలని ఆయన ఎన్నికల సంఘాన్ని ఆయన డిమాండ్ చేశారు. న్యాయపోరాటం చేస్తామని తెలిపారు.

ఓటమి భయంతోనే వైసీపీ డ్రామాలు

మొదటి పేజీ తరువాయి

విశాలాంధ్ర-పులివెందుల: ఓటమి భయంతోనే వైసిపి నాయకులు డ్రామాలాడుతున్నారని కూటమి జెడ్పిటిసి అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి స్పష్టం చేశారు. ఆమె మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల తర్వాత ఈ ప్రాంత ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. ఎలాగూ ఓడిపోతున్నామని తెలిసే వైసిపి నేతలు దౌర్జన్యాలకు తెరలేపారన్నారు. ఎంత ప్రలోభాలకు గురిచేసినా ఓటర్లు లొంగలేదన్నారు. ఓటు వేయడానికి వెళ్తున్న తమ వారిపై వైసిపి దాడులకు తెగబడిందన్నారు. ఏజెంట్లుగా కూర్చోనివ్వకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. కానీ దగ్గరుండి ఏజెంట్లను నిలుపుకోవాల్సి వచ్చిందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఓటు వినియోగించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ ఎన్నికల్లో తాను విజయం సాధిస్తానని ఆమె ధీమా వ్యక్తంచేశారు.

ఉప ఎన్నిక ప్రశాంతం

మొదటి పేజీ తరువాయి

ఆయన ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిపి మంగళవారం పరిశీలించారు. ఈ రెండు ఉప ఎన్నికలలో ఓటర్లు వారి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నట్లు స్పష్టం చేశారు. రెండు చోట్లా 80శాతం పోలింగ్ నమోదైందన్నారు. నల్లపురెడ్డి పల్లె పోలింగ్ స్టేషన్ వద్ద కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. ఎక్కడా అవాంతరాలు లేకుండా పోలింగ్ సజావుగా సాగుతోందని తెలిపారు. ఇటు పులివెందుల, అటు ఒంటిమిట్ట మండలాల్లో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద సిసి కెమెరాల పర్యవేక్షణ, వెబ్ కాస్టింగ్, మైక్రో అబ్జర్వర్ల పర్యవేక్షణలో ఉపఎన్నిక పోలింగును ప్రశాంతంగా నిర్వహించామన్నారు. 11గంటల సమయానికే.. 40శాతం పైగా పోలింగ్ నమోదయిందన్నారు. ఓటర్లు సజావుగా ఓటుహక్కు వినియోగించుకుంటున్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్ల సౌకర్యార్థం పోలింగ్ స్టేషన్ వద్ద తాగునీరు, మెడికల్ ఎమర్జెన్సీ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామని చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద నలుగురు సిబ్బందితో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, అలాగే పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సౌలభ్యం కోసం ఆయా ప్రాంతాల రూట్లలో నాలుగు ఆర్టీసీ బస్సులను, ఆటోలను నడుపుతున్నట్లు వివరించారు. పులివెందులలోని మొత్తం 15పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించి అన్ని భద్రతా చర్యలను ఏర్పాటు చేశామని, అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి హింసాత్మక ఘటనలకు తావు లేకుండా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టామని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో కూడా సజావుగా పోలింగ్ జరుగుతోందని వారు స్పష్టం చేశారు. కొన్ని సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను పట్టించుకోకుండా అవగాహనతో ఓటర్లు సంయమనంగా.. ఓటు హక్కును ఉపయోగించు కుంటున్నారని తెలిపారు.

అరెస్టు అన్యాయం

మొదటి పేజీ తరువాయి

విశాలాంధ్ర-పులివెందుల: తనను అరెస్టు చేయడం అన్యాయమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి వెల్లడించారు. పులివెందుల జెడ్పీటీసీ ఉపఎన్నిక సందర్భంగా పోలీసు అధికారులు మంగళవారం ఆయన ఇంటి వద్దకు వెళ్లారు. అరెస్టు చేసి కడపకు తీసుకెళ్లారు. ఆయన మాట్లాడుతూ తాను పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లలేదని చెప్పినా పోలీసులు వినలేదన్నారు. తనకు ఫ్యాక్షన్ చరిత్ర లేదని, అధికార పార్టీ ఎమ్మెల్సీనని ఎంత వివరించినా పోలీసులు వినకుండా తన మాటలను పెడచెవిన పెట్టారన్నారు. అయితే రామగోపాల్‌రెడ్డి అరెస్టు సమయంలో కొంతమంది కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. చివరకు ఆయన్ను అరెస్టు చేసి కడపకు తీసుకెళ్లడంతో పరిస్థితి సద్దుమణిగింది.

ఎంపిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

విశాలాంధ్ర-యర్రగుంట్ల:

ఉపఎన్నిక నేప థ్యంలో అవినాష్ రెడ్డిని పులివెందులలో పోలీ సులు అదుపులోకి తీసుకొని ఎర్రగుంట్ల మీదుగా తరలిస్తుండగా స్థానిక మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. అనంతరం పోలీసులు ఎంపీని సుధీర్ స్వగ్రామం నిడిజువ్వికి తరలించారు. మాజీ ఎమ్మెల్యేలు రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, శెట్టిపల్లి రఘురామిరెడ్డి, డిసిసి మాజీ చైర్మన్ తిరుపాల్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ సలహాదారు సాంబటూరు ప్రసాద్ రెడ్డి నిడుజువ్వి చేరుకున్నారు. ప్రస్తుత పరిస్థితులపై ఎంపీతో వారు చర్చించారు. తదనంతరం ఎంపీ అవినాష్ రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు నిడిజువ్వి నుండి ర్యాలీగా ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలి చేరుకున్నారు. కూడలిలో ఎంపీ, నాయకులు శ్రేణులతో కలిసి బైఠాయించారు. అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ రాజ్యాంగాన్ని ఖూనీ చేసి ఎన్నికల వ్యవస్థను అభాసుపాలు చేస్తున్నారని మండిపడ్డారు. దొంగ ఓటర్లతో మోసపూరితంగా రిగ్గింగ్ చేస్తుంటే ఉన్నత శ్రేణి అధికారులు చోద్యం చూస్తుం డిపోయారని ఆరోపించారు.

జెడ్పీటిసి స్థానాలు టిడిపివే

మొదటి పేజీ తరువాయి

మంగళవారం హోటల్ మానస ఇన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఒంటిమిట్ట జడ్పిటిసి ఎన్నికల ఇన్చార్జిగా తనను నియమించారని పేర్కొన్నారు. అభివృద్ధిని చూసి ఓటు వేయాలని తాము ప్రజలను కోరామని తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో భద్రాచలం తెలంగాణకు వెళితే, ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. రెండు జెడ్పిటిసి స్థానాలను గెలిచి సీఎంకు కానుకగా ఇస్తామని పేర్కొన్నారు. కొన్ని మీడియా ఛానల్లలో మంత్రి రౌడీయిజం చేస్తున్నాడని ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. టిడిపి కార్యకర్తకు ఆపద వస్తే పార్టీ తరపున తాము ఆదుకుంటామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం ఉంది కాబట్టే వైసిపి అభ్యర్థులు నామినేషన్ వేశారని గుర్తుపెట్టుకోవాలన్నారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో మూడు కోట్లకు పైగా ఓటు హక్కు ఉన్న స్థానాలను ప్రత్యర్థులను భయపెట్టి ఏకగ్రీవం చేశారని, ప్రస్తుతం 35 వేల ఓట్లు ఉన్న స్థానానికి మాత్రమే ఇక్కడ ఎన్నికలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎవరి హయాంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారో దీనిని బట్టి స్పష్టమవుతుందని తెలిపారు. అభ్యర్థులను కనీసం నామినేషన్ కూడా వేయించలేదని చెప్పారు. ప్రేమ, అనురాగాలతో ఓటు అడిగాము తప్ప, ఎక్కడ రాజీ, లాలూచీ తాము పడలేదని పేర్కొన్నారు. టిడిపి ఏజెంట్ల పై వైసిపి మూకలు రౌడీయిజం, దుర్భాషలాడడం చేశారని తెలిపారు. పెన్షనర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెళితే వైసిపి మూకలు బెదిరించాలని చెప్పారు. ఎమ్మెల్యే ఆర్కే పార్టీ అమర్నాథ్ రెడ్డి మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ఇక్కడ ఏం పని అనడం హాస్యాస్పదమన్నారు. దేశంలో ఎక్కడికైనా పోయే హక్కు భారత పౌరుడిగా తనకు ఉందని గుర్తుంచుకోవాలన్నారు. ఎన్నికలు చూడని గ్రామాలు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నాయని పేర్కొన్నారు. విజయం సాధించడం తథ్యమని తెలిపారు. ఈ ఎన్నికల్లో రాజకీయాలు కొత్త పుంతలు తొక్కయని ఇళ్ల వద్దకు పోయి బెదిరించాలని, ఏజెంట్లుగా కూర్చోకుండా భయపెట్టారని చెప్పారు. 14 నెలలలో జగన్మోహన్ రెడ్డి చేసింది శూన్యమని పేర్కొన్నారు. 420, 840 వాళ్ళ వద్దకు వెళ్లి పరామర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎక్కడ ఎన్నికలు జరిగినా విజయం సాధ్యమని తెలిపారు.

ఉద్రిక్తతల నడుమ ఉప ఎన్నిక

మొదటి పేజీ తరువాయి

ఈ ఉప ఎన్నికల్లో వైసిపి నాయకులు చేతులెత్తేసినట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నాయకులు మాత్రం మూడు దశాబ్దాల తర్వాత ఈ ప్రాంత ఓటర్లకు ఓటు హక్కు వినియోగంతో పాటు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించారిన చెబుతున్నారు. పులివెందుల జెడ్పీటీసీ నుంచి టిడిపి, వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థులతో పాటు మరో 8మంది స్వతంత్ర అభ్యర్థులు రంగంలో నిలిచారు. మొత్తం 15పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరస్పర ఆరోపణలు మినహా మరెక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కణం పల్లెలో రీపోలింగ్ జరిపించాలి..

పులివెందుల రూరల్ జెడ్పిటిసి స్థానానికి మంగళవారం జరిగిన పోలింగ్ అన్యాయంగా అక్రమంగా పోలీసులు దగ్గరుంటే జరిపించాలని కణంపల్లి గ్రామ ప్రజలు విలేకరుల ముందర వాపోయారు. ఇటువంటి ఎన్నికలు మేము చూడలేదని, పోలీసులు అధికార తొత్తులుగా వ్యవహరించారని, ఓటు వేయడానికి వెళితే పోలీసులు ఓట్లు వేయకుండా మమ్మల్ని బెదిరించారని, ఓటు లేదు ఏమీ లేదు అంటూ వెళ్లిపోండని కనికరం లేకుండా ప్రజలను తరిమి తరిమి కొట్టారన్నారు. మేము ఒక్కటే విన్నవించుకుంటున్నామని అధికారులు వెంటనే మాకు రీపోలింగ్ జరిపించేటట్లు చూడాలని వారు అర్జీని స్థానిక ఎంపీడీవోకు అందజేశారు.

రైతులకు సబ్సిడీ డ్రోన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: రైతులకు సబ్సిడీ ద్వారా డ్రోన్లను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పంపిణీ చేశారు. మండలంలోని చెన్నమరాజు పల్లెలో రైతులకు సబ్సిడీ ద్వారా డ్రోన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆధునిక, వ్యవసాయ, పద్ధతులను పాటించాలని, పెట్టుబడులు తగ్గించుకుంటేనూ లాభాలు పెరుగుతాయని వ్యవసాయ అధికారుల సలహాల మేరకు ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులు వాడాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్, లింగాపురం ఏజీఆర్ బ్యాంక్ చైర్మెన్ సిద్ధారెడ్డి, నాగమునిరెడ్డి, ఏడీ అనిత, ఏఓ వరహరి, సర్పంచ్ రాజువారి ఆదిలక్షుమ్మ, నాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో సాగు విధానం సులభతరం : జిల్లా జేడీఏ చంద్రనాయక్

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: డ్రోన్‌తో సాగు విధానం సులభతరం అని, వ్యవసాయ పనులకు డ్రోన్ సహాయం రైతన్నలకు ఎంతగానో ఉపయోగపడుతుందని జేడీఏ చంద్ర నాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని చెన్నమరాజు పల్లెలో శ్రీ ఆంజనేయ రైతు మిత్ర సంఘానికి 80శాతం సబ్సిడీతో అందంఇచిన వ్యవసాయ డ్రోన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సంధర్భంగా జేడీఏ చంద్రనాయక్ మాట్లాడుతూ రైతన్నలకు ఖర్చు సమయం ఆదాతో పాటు డ్రోన్ నిరుద్యోగులు, వ్యవసాయ యువతకు ఉపాధి అవకాశంగా కూడ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం 80శాతం రాయితీతో అందిస్తున్న ఈ డ్రోన్‌ను మండలానికి అందించనున్నామని తెలిపారు. ఆసక్తి గల రైతు సంఘాలు ధరఖాస్తు చేసుకుంటే లక్ష్యానికి మించి కూడ డ్రోన్లను సరఫరా చేస్తామని అన్నారు. ప్రొద్దుటూరు మండలానికి ఇప్పటికి రెండు డ్రోన్లను అందించామని పేర్కొన్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని రైతులు పంట సాగులో మితిమీరిన యూరియాను వాడొద్దని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి వస్తున్న సబ్సిడీ, రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు డివిజన్ ఏడీఏ అనిత వ్యవసాయ శాఖ అధికారి సాంబ వర హరికుమార్, ఆత్మ బీటీఓం చెన్నకేశవ, విఏఏ సుమలత, వ్యసవాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానస్థలాన్ని పరిశీలించిన రెవెన్యూ అధికారులు

విశాలాంధ్ర-వాల్మీకిపురం :సమాధులు వేసిన ఏరు పోరంబోకు స్థలం కబ్జా అన్న కథనం ఈనెల 6వతేదీ ప్రచురితమైంది. ఇందుకుస్పందించిన తహసీల్దార్ పామిలేటి రెవెన్యూ అధికారులతో కలిసి మంగళవారం మండలంలోని ఓబులంపల్లెలోని స్మశానానికి చెందిన వివాదస్పద స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామానికి చెందిన దళితులు తమ పెద్దలను వేసిన సమాధులను సైతం కూల్చేసి కొంత మంది వ్యక్తులు భూమిని కబ్జాచేస్తున్నారని వాపోయారు. సమగ్ర విచారణ జరిపి న్యాయం చేస్తామని తహసీల్దార్ గ్రామస్థులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, నాగేంద్ర, ప్రకాష్ పవన్, శ్రీనివాసులు, సయ్యద్వలి, శివ, కుమారస్వామి, రాజశేఖర్, సహదేవయ్య, మెహన్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూళన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు పట్టణంలోని వైవీఎస్ గర్ల్స్ హైస్కూల్ నందు బాలికలకు అల్బెండజోల్ మాత్రలను మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య మింగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి బాల బాలికలు అల్బెండజోల్ మాత్రలు తీసుకొని చదువుపై ఏకాగ్రతను, నేర్చుకునే సామర్థ్యాన్ని పెంపొంపించుకోవాలని తెలిపారు. వైద్యాధికారిణి డా.నల్లబల్లి హిమబిందు మాట్లాడుతూ ఈ అల్బెండజోల్ మాత్రలు నమిలి మింగడం వలన రక్తహీనతను, పోషకాహార లెపమును, ఆకలి మందగించడమం, నీరసం, కడుపు నొప్పిని నివారించడం, వాంతులు, బరువు తగ్గడం వంటి వ్యాధ్యులను నివారించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఆర్‌డీసొసైటీ ప్రెసిడెంట్ ఎం.వి సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

విధ్యార్థుల హక్కులను ఉల్లంఘిస్తున్న ప్రభుత్వాలను రద్దు చేయాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బత్తుల పీటర్ డిమాండ్

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: విధ్యార్థుల హక్కులను ఉల్లంఘిస్తున్న ప్రభుత్వాలను రద్దు చేయాలని, విద్యా రంగంలోని సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బత్తుల పీటర్ పేర్కొన్నారు. మంగళవారం ప్రొద్దుటూరులోని స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ 90వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని స్థూపాల వద్ద ముఖ్య అతిధులుగా ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు, పి.సుబ్బ రాయుడు హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సంధఋంగా బత్తుల పీటర్ మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ భారతదేశ స్వాతంత్ర్య మరియు ఈ దేశాన్ని పాలిస్తున్న బ్రిటిష్ శ్వేత జాతీయులకు వ్యతిరేకంగా మన జన్మ హక్కు కోసం పోరాడటానికి ఏర్పడిన సంఘం అని అన్నారు. ఆగస్టు 12, 1936న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని బనారస్ విశ్వవిద్యాలయ విధ్యార్థులు విద్యారంగ సమస్యలను పరిష్కరించడానికి అవిశ్రాంత పోరాటం ప్రారంభించారు. విద్యా రంగంలోని సమస్యలను పరిష్కరించడానికి రాబోయే కాలంలో ఏఐఎస్ఎఫ్ మిలిటెండ్ పోరాటాలను నిర్వహించడానికి విధ్యార్థి లోకం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధు, చందు, మదన్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులపై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక మున్సిపల్ హైస్కూల్, రామేశ్వరం మరియు బొల్లవరం అంగన్వాడీ కేంద్రం నందు ఉప జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.గీత జాతీయ నులిపురుగుల నిర్మూళన గురించి అవగాహణ కల్పించి అల్బండజోల్ మాత్రలు మింగించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూళన కోసం ప్రతి అంగన్వాడి కేంద్రం, ప్రభుత్వ మరియు ప్రైవేట్ స్కూల్స్, కాలేజీలలో 1 నుండి 19సంవత్సరం వరకు పిల్లలందరికి అల్బండజోల్ మాత్రలు వేస్తారన్నారు. కావున తమ పిల్లలకు ఈ అల్బండజోల్ మాత్రలు వేయించి ఆరోగ్యంగా ఉండేలా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డా.మౌనిక, డా.హిమబిందు, ప్రధానోపాధ్యాయులు సత్యబాబు, డిప్యూటి హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, శోభారాణి, సీఓ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్ఐవీ/ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి నందు చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో 'మీకు తెలుసా' ఐఈసీ హెచ్ఐవీ ఎయిడ్స్ నిర్మూళన అవగాహణ కార్యక్రమం మరియు ఐఈసీ పోస్టర్స్‌ను ఆవిష్కరించి రాష్ట్ర స్థాయి కామ్యపెయిన్‌ను ప్రారంభించారు. ఈ నెల 12వ తేదిన అంతర్జాతీయ యువజన దినోత్సవం సంధర్భంగా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై సమాచారాన్ని అందించేందుకు,ప్రజల్లో అవగాహణ పెంపొందించేందుకు న్యాకో నేతృత్వంలో 8వారాల పాటు(2నెలలు) 'మీకు తెలుసా' రాష్ట్ర స్థాయి క్యాంపెయిన్ పోస్టర్‌లను ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ రూపానంద్, ఆర్ఎంఓ గోపాల్, ఎఆర్‌టి సీనియర్ మెడికల్ ఆఫీసర్ సూర్య నాగలక్ష్మి, చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వారి సమక్షంలో ప్రారంభించారు. ఎఆర్‌టి సీనియర్ మెడికల్ ఆఫీసర్ సూర్య నాగలక్ష్మి మాట్లాడుతూ అవగాహణ కార్యక్రమాలను జిల్లాలో ఉన్న ఎన్జీఓలు, హెచ్ఐవీ మీద పనిచేసే సిబ్బంది సహకారంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. హెచ్ఐవీ ఎయిడ్స్ సుఖ వ్యాదుల పట్ల అవగాహనతో ఎక్కువ మంది హెచ్ఐవీ రక్త పరీక్షలు చేసుకునేలా ముందుకు రావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఈ శివ శంకరయ్య, ఐటిటీసీ మరియు ఎఆర్‌టి కౌన్సిలర్స్ బాల గంగిరెడ్డి, నాగేంద్ర, శ్రీరాములు, చంద్రలీల, వినయ్‌బాబు, రేవతి కుమార్, సిబ్బంది సాదిక్ బాష, మహేశ్వరి, ఎన్‌జీఓ ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్‌కుమార్, పుల్లయ్య మరియు సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

విశాలాంధ్ర-వాల్మీకిపురం : పిల్లల్లో వచ్చే రక్తహీనతను (డీ వార్మింగ్ డే) నివారించేందుకే నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నమయ్య జిల్లా డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా కోర్డినేటర్ డాక్టర్ లోక వర్ధన్ అన్నారు. గండ బోయనపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలతో పాటు, అంగన్వాడీ కేంద్రంలాకు హాజరైన లోకపర్ధన్ చిన్నారులకు అల్బండాజోలు మాత్రలను మింగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో- డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, ఉపాధ్యాయురాలు గౌసియా, రాణి, అంగన్ వాడి వర్కర్లు పాల్గొన్నారు

వార్డులో కమిషనర్ ముమ్మర పర్యటన

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: మున్సిపల్ కమీషనర్ సి.రవిచంద్రా రెడ్డి పట్టణ పర్యటణలో భాగంగా స్థానిక బాలాజీ నగర్‌లో పర్యటించారు. ఈ సంధర్భంగా స్థానిక ప్రజల సమస్యలు తెలుపగా అక్కడి పర్యటించి అక్కడ ఉన్న చెత్తపాయింట్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయవలసిందిగా సంబంధించిన శానిటరీ ఇన్స్‌స్పెక్టర్‌కు ఆదేశించారు. అలాగే గాంధీ రోడ్డులోని రోటరీ హాస్పిటల్ వారు సమస్య తెలుపగా అక్కడ పర్యటించి నీరు నిలబడకుండా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధించిన ఇంజనీరింగ్ విబాగం వారికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ డి.కొండయ్య, శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ ఎస్.నూర్ బాష తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు స్నేహాలక, అలవాట్లకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర-వాల్మీకిపురం : సమాజంలో యువత నిర్భయంగా వైద్యపరీక్షలు చేయించుకోవాలని తద్వారా ఏవైనా సమస్యలుంటే సకాలంలో వైద్యం చేసుకుని ఆరోగ్యంగా జీవించవచ్చునని ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు గౌతమి అన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ప్రభుత్వ వీవీసీ జూనియర్ కళాశాల ఆవరణలో హెచ్ఐవీ ఎయిడ్స్ నివారణ, నియంత్రణ మండలిలతో పాటు ఆర్ఎర్ఎస్ సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా ఐరుసీ హెచ్ఐవీ ఎయిడ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతమి కౌన్సిలర్ లోకేష్ శ్రీలక్ష్మి తదితరులు ఇంటర్ విద్యార్థులకు హెచ్చెనీ, ఎయిడ్స్ వ్యాధులపై అవగాహన కల్పించారు యువత నిర్భయంగా వెద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఉమా అమరేశ్వరి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలతో పాటు చెడు స్నేహాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పరమేశ్వరరెడ్డి, ఆధ్యాపకులు, ప్రాజెక్టు మేనేజర్ పురుషోత్తం, స్వేత, లత, పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ సత్య సాయి బాబా విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర-వాల్మీకిపురం :పట్టణంలోని రాముల వారిగుడి ఎదురుగా ఉన్న శ్రీ సత్యసాయి మందిరంలో వైభవంగా పాలరాతి సత్య సాయి బాబ విగ్రహాన్ని వేదపండితుల మంత్రాల మధ్య వైభవంగా ప్రతిష్టించారు. మంగళవారం శ్రీ సత్యసాయిసేవా సమితి సభ్యులు ఆధ్వర్యంలో ప్రతిష్టాకార్యక్రమం అనంతరం శ్రీ సత్యసాయిబాబా విగ్రహానికి విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిహెూమం, శాంతిపూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో వాల్మీకిపురం శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

హెచ్ఐవిపై యువతకి అవగాహన కలిగి ఉండాలి

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష వీడాలని, ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాలు, మత్తు పానీయలపై అవగాహన కలిగి ఉండాలని, నిత్యం వీటిపై చర్చ జరుపుకోవాలని, ప్రతిఒక్కరు తరచూ మాట్లాడుకొంటూ ఉండాలని తద్వారా హెచ్ ఐ వి అరికట్టడం సాధ్యం అవుతుంది అని, అలాగే గంజాయి, బ్రౌన్ షుగర్ లాంటి మత్తు ఇచ్చే వాటిని నిర్మూలించేందుకు యువత ముందుండాలన్నారు.ఈ కార్యక్రమంలో రెసిడెన్షియల్ మెడికల్ అధికారి నవీన్, పులివెందుల ప్రాంత ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఖాజా మొయిద్దీన్, ఎయిడ్స్ నియంత్రణ విభాగం వైద్యులు డాక్టర్ సౌజన్య, డాక్టర్ శ్రీనివాస్, ఐసీటీసీ, ఎస్ టీడీ, పొగాకు నియంత్రణ, టీబీ కౌన్సిలర్లు వెంకటసుబ్బయ్య, బాదల్ వల్లి, సుమలత, భాగ్యలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ నాగేష్, సీడీ ఎస్ మేనేజర్ వలి, సిబ్బంది, సీనియర్ అసిస్టెంట్ నరేష్, ఆసుపత్రి సిబ్బంది, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయునికి స్వరకిరిటి జాతీయ అవార్డు

విశాలాంధ్ర-బద్వేలు: నియోజకవర్గ పరిధిలోని గోపవరం మండలం పిపి కుంట ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కే ఓబులా పతికి ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో జరిగిన శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో సింగర్ ఫేస్ట్ 2025 జరిగిన ప్రోగ్రాంలో స్వరకిరిటీ అనే జాతీయ పురస్కారం లభించింది ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు కత్తిపాక ప్రతాప్ మాట్లాడుతూ శ్రావ్యమైన స్వరమే ఓబులా పతికి ఒక వరం అనే గత 26 సంవత్సరాలకే ఒక కళాకారునిగా సేవలందించిన ఓబులా పతికి గుర్తించి ఎంపిక చేయడం జరిగిందనీ ప్రశంసించారు. రాయలసీమ నుండి పాల్గొన్న వారిలో ఓబులా పతికి ప్రథమ స్థానం దక్కడం హర్షించదగ్గ విషయం అన్నారు.

నులి పురుగుల మాత్రలు తప్పనిసరిగా ఇవ్వాలి

విశాలాంధ్ర-ముద్దనూరు: పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా ఇవ్వాలని ఎంపీడీఓ పరిపూర్ణ అరుంధతి అన్నారు. మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని మండల పరిధిలోని అన్ని పాఠశాలలకు పంపిణీ చేశామని తెలిపారు. మండల కేంద్రంలో డాక్టర్ కరిష్మా, డాక్టర్ శ్రీకాంత్ నులి పురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సందర్భంగా మాట్లాడుతూ సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలందరికి అల్బెండజోల్ మాత్రను ఇవ్వాలని ఆదేశించారు. మాత్రను అందించి నమిలి మింగేలా చూడాలన్నారు. పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలందరికి నులి పురుగుల మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారుఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ వై. ప్రసాద్ యాదవ్, హెడ్ మాస్టర్ ఓబులేసు, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులు రెడ్డి, ఎల్ టీ జాసన్, ఆశా కార్యకర్తలు విద్యార్థినీ విద్యార్థుల , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుట్టలు కనుమరుగు.!

- యథేచ్ఛగా మట్టి తవ్వకాలు.. రెచ్చిపోతున్న మాఫియా

విశాలాంధ్ర-గాలివీడు: అక్రమార్కుల తవ్వకాలతో గుట్టలు, చెరువులు కనుమరుగవుతున్నాయి. ప్రభుత్వ సంపదనను కొల్లగొడుతూ పర్యావరణానికి హాని కలిగిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండ విచ్చల విడిగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. రోజురోజుకు మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. మండలంలోని పలు గ్రామాల్లో అక్రమార్కులు ప్రభుత్వ భూముల్లోని గుట్టలను తవ్వి మట్టి అక్రమ రవాణా చేస్తు సొమ్ము చేసుకుంటున్నారు.గత కొద్ది రోజులుగా ఈ దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అయినప్పటికి అక్రమ వ్యాపారాన్ని నిలువరించే వ్యవస్థే కరువైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ మట్టి వ్యాపారానికి కొందరు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు సహకరిస్తుం డటంతో అక్రమార్కులు తమ వ్యాపారాన్ని నిరాటకంగా కొనసాగిస్తున్నారు.

తరిగిపోతున్న గుట్టలు..

అక్రమార్కుల తవ్వకాలతో ప్రభుత్వ భూములోని గుట్టలు తరిగిపోతున్నాయి. మండలంలోని గుర్రాల మిట్ట,కుమ్మరపల్లె వద్ద పేరాల గుట్ట, గాలివీడు పెద్ద చెరువు తదితర ప్రాంతాల్లో గల గుట్టలను తవ్వి మట్టిని రవాణా చేస్తున్నారు.దీంతో ఇప్పటికే గుట్టలు మాయమై క్వారీలుగా దర్శనమి స్తున్నాయి. చెరువుల్లో తవ్వకాలు జరపడంతో క్వారీలుగా మారాయి.

పట్టపగలే తోలకాలు..

అక్రమార్కులు పట్టపగలే జేసీబీ యంత్రాల సాయంతో మట్టిని తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తూ తమ వ్యాపారాన్ని కొనసాగి స్తున్నారు. రెవెన్యూ కార్యాలయాలు పనిచేసే సమయంలోనే మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నప్పటికీ కనీసం అడ్డుకునేవారు లేకపోవడం గమనార్హం. దీంతో సోమవారం ఉదయం గుర్రాలమిట్టలో దాదాపు మూడుచోట్ల జేసీబీ యంత్రాలతో మట్టిని తరలించారు. అక్రమార్కులు ఒక్కో క్క ట్రాక్టర్ ట్రిక్‌ను రూ. 800 నుంచి రూ.1000లకు విక్రయిస్తూ లక్షల ఆదాయాన్ని గడిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

అక్రమార్కులు ప్రభుత్వ సంపదనను కొల్లగొడుతున్న ప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం ప్రజలను విస్మ యాన్ని కలిగిస్తోంది. ప్రభుత్వ భూములు, చెరువులు,గుట్టలను తవ్వి అక్రమంగా మట్టి వ్యాపారాన్ని కొందరు కొన సాగిస్తున్నారని ప్రజలు రెవెన్యూ అధికారులకు సమాచారాన్ని ఇచ్చినా పట్టించుకోకపోవడం పట్ల పలు అను మానాలకు తావిస్తోంది. అధికారుల అండలతోనే అక్రమార్కులు తమ మట్టి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని ప్రజలు అంటున్నారు.ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అక్రమ మట్టి రవాణాను అరికట్టి ప్రభుత్వ సంపదను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్లాసులు గలగల.. నిబంధనలకు తూట్లు..

మొదటి పేజీ తరువాయి

విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కోమద్యం దుకాణానికి ఒకటి రెండు గొలుసు కట్టు దుకాణాలు ఉన్నట్లు అంచనా. ఆయా చోట్ల విచ్చలవిడిగా తాగేస్తూ ఉన్నారు. మద్యం దుకాణాలు దాదాపు బార్ లను తలపిస్తున్నాయి. ఫాస్ట్ ఫుడ్, ఇతర చిరుతిళ్ళు, పొగాకు ఉత్పత్తులు, సిగరెట్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పలుచోట్ల మద్యం దుకాణాల వద్ద అనధికారికంగా ప్రత్యేక వసతులను ఏర్పాటు చేశారు. రాత్రి 10 గంటల లోపు పద్యం దుకాణాలన్నీ మూతపడాల్సి ఉంది. ఉదయం వీటిని టీ దుకాణాల కంటే తెరిచి ఉండటాన్ని మనం ఇక్కడ ప్రత్యక్షంగా తిలకించవచ్చు. కానీ నిబంధనలు ఏ కారణం చేతనో అమలు కావడం లేదు. లావాదేవీలు చూసుకునేందుకు మాత్రమే అని ఓవైపు సదరు దుకాణాల యజమానులు చెబుతున్నప్పటికీ వాస్తవంగా మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు. నిబంధన లనుతుంగలో తొక్కి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు ఏ కారణం చేతనో నోరు మెదపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు నిబంధనల అమలుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పిల్లల ఎదుగుదలకు అల్బెండజోల్ మాత్రలు కీలకం

- డాక్టర్ ఉష్‌శ్రీ

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: పిల్లల ఆరోగ్యంగా ఎదుగుదలకు అల్బెండజోల్ మాత్రలు కీలకం అని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి డాక్టర్ ఉష్‌శ్రీ పేర్కొన్నారు. జాతీయ నులిపురు గుల నివారణ దినోత్సవం సందర్భంగా అన్న మయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య ఆదేశాల మేరకు మంగ ళవారం అన్ని ప్రభుత్వ, ప్రయివేటు, పాఠశా లలో, జూనియర్ కళాశాలలో,అంగన్ వాడి కేంద్రాలలో విద్యార్ధిని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అనంతరం డాక్టర్ ఉష్‌శ్రీ అల్బెండ జోల్ మాత్రలను పిల్లలకు నోటిలో వేసి మింగి చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఆరునెలలకు ఒక అల్బెండజోల్ మాత్రలు మింగించడం వలన పురుగులు అన్ని చనిపో యి పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు.1 సంవత్సరం నుంచి 19 సంవత్సరాలు వయ స్సున్న పిల్లలందరికీ మింగించాలన్నారు. అల్బెండజోల్ మాత్రల వలన పిల్లల్లో రక్తహీనత, పోషక లోపం ఆకలి మందగించడం తదితర వ్యాధులు పూర్తిగా తొలగిపోతాయన్నారు. ఈ రోజు అందుబాటులో లేని పిల్లలు 20 తారీఖున బుధవారం మధ్యాహ్నం అల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలో 25,160 పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు మింగించాలని టార్గెట్ గాను 24,263 మంది పిల్లలకు వైద్య సిబ్బంది అల్బెండజోల్ మాత్రలు మింగించారు.ఈ కార్యక్రమంలో శెట్టిగుంట పిహెచ్ సి డాక్టర్ లీలా, కోడూరు పిహెచ్ సి డాక్టర్ నిమ్మిచి, హెల్త్ సూపర్ వైజర్ బాలకృష్ణంరాజు, ఆరోగ్య విస్తరణాధికారి శివరామకృష్ణ,శివశంకర్ గౌడ్, సిహెచ్ ఓ లక్ష్మీదేవి, పిహెచ్ ఎన్ జయలక్ష్మి, ఎఎన్ఎం సుధామణి, ఇంద్రాణి, ఎంఎల్ ఎన్ పి నందిని తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడు 'రంగనాథన్'

- సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులుఆచార్య జి.పార్వతి

విశాలాంధ్ర-కడప వైవీయూ: గ్రంథాలయం లో పుస్తకాల వర్గీకరణకు సి.సి.(కోలోన్ క్లాసిఫికేషన్) ప్రక్రియను తీసుకొచ్చిన గ్రంథా లయ పితామహుడు డా.ఎస్.ఆర్. రంగనా థన్ అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం మంగళవారం ఎస్.ఆర్.రంగనాథన్ జయంతి సందర్భంగా 'గ్రంథపాలకుల దినోత్సవాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముందుగా సంచాలకులు, సిబ్బంది కలసి ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూల మాల సమర్పించి నివాళులర్పించారు. ఆ తర్వాత ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ డా.ఎస్.ఆర్.రంగనాథన్ మద్రాసులో 1927 వ సంవత్సరంలో జరిగిన 4వ అఖిల భారత పౌర గ్రంథాలయ మహాసభ పూర్వ్యాకా మద్రాసు గ్రంథాలయ సంఘాన్ని స్థాపించేందుకు సహకరించారన్నారు. సహాయ పరిశోధకులు డా. చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో గ్రంథాలయాలు క్రియాశీలక పాత్ర పోషించాయన్నారు. గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేష్ రావు మాట్లాడుతూ బెనారస్ విశ్వవిద్యాలయంలోని లక్ష పుస్తకాలను రంగనాథన్ వర్గీకరించడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నులి పురుగులు మందులు పంపిణీ

విశాలాంధ్ర-సుండుపల్లె: అల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వలన రక్తహీనత రాకుండా ఉంటుందని సుండుపల్లె చిన్నపిల్లల వైద్యులు దిలీప్ గుప్త, రాయవరం వైద్య అధికారి శేఖర్ రెడ్డిలు తెలిపారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా అల్బెండజోల్ మాత్రలు వేయడం జరిగిందన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో అంగన్వాడీ కేంద్రాల్లో ఈ మాత్రలు 1 సంవత్సరం నుండి 18 సంవత్సరాలలోపు పిల్లలకు అందజేయడం జరిగిందన్నారు. రక్తహీనత రాకుండా ఉండేందుకు తప్పనిసరిగా ఈ మాత్రలు వేయించుకోవాలన్నారు. నులి పురుగు శరీరంలో ఉంటే కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనలు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, అలసట రక్తం హీనత ఏర్పడుతుందని అన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర-మదనపల్లె: అన్నమయ్య జిల్లా రెండవ మహాసభలు మదనపల్లి వేదికగా రెండు రోజులపాటు నిర్వహించుకోవడం జరిగింది. మంగళవారంతో ఈ మహాసభలు ముగిసిన సందర్భంగా జిల్లా నూతనంగా కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కార్యవర్గంతో పాటు జిల్లా సమితి సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కార్యదర్శిగా ఎన్నికైన మహేష్ మాట్లాడుతూ,మూడు రోజులు పాటు జరిగిన ఈ మహాసభలలో జిల్లా సమగ్ర అభివృద్ధి పైన సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించుకోవడం జరిగిందని, రాబోయే రోజుల్లో ఈ జిల్లాలో పెండింగ్లో ఉన్న నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని,కడప నుండి రాయచోటి మదనపల్లి మీదుగా బెంగళూరు రైల్వే లైను పనులు పునఃప్రారంభించాలని, హంద్రీనీవా సమాంతర కాలువ తీసుకురావాలని, మదనపల్లి దాహార్తిని తీర్చడానికి నిర్మించిన చిక్కిలి సమ్మర్ స్టోరేజ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని,బిటి కళాశాల ఆస్తులను పూర్తిగా ప్రభుత్వం స్వాధీనం చేసుకొని,కళాశాలను అభివృద్ధి చేసి, ఈ కళాశాలలో వృత్తి విద్య కోర్సులు, ఇంటర్మీడియట్ కోర్సులను,పీజీ కోర్సులు ప్రారంభించి,బిటి కళాశాలను యూనివర్సిటీగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణప్ప మాట్లాడుతూ మదనపల్లి నియోజకవర్గంలో ఎన్నికల్లో అలివి కాని హామీలు ఇస్తున్నారని, అధికారంలోకి వచ్చిన తర్వాత పాలకులు హామీలను గాలికి వదిలేస్తున్నారని,మదనపల్లి నుండి నిమ్మనపల్లి, మదనపల్లి నుండి రామసంద్రం రోడ్డు ఎన్నికల ఎజెండాగానే మిగిలిపోతుంది తప్ప అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మదనపల్లి నియోజకవర్గంలో భూ అక్రమాలు దందాలు విపరీతంగా పెరిగిపోయాయని, ఏ ప్రభుత్వ ఆఫీసుకెళ్లిన లంచాల పర్వం నడుస్తుందని,గత ప్రభుత్వ హయాం కంటే పదింతలు భూకబ్జాలు పెరిగిపోయాయి అన్నారు. జిల్లా మహాసభల వేదికగా సుదీర్ఘంగా చర్చించి భవిషత్ కార్యాచరణ రూపొందించామని, ఈ అంశాలపైన సిపిఐ భవిష్యత్తులో అభివృద్ధి కోసం భవిష్యత్తులో పోరాటాలు కొనసాగిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మనోహర్ రెడ్డి,సిద్దిగాల శ్రీనివాసులు, దేవర, సాంబశివ, సుధీర్, నియోజకవర్గ కార్యదర్శి మురళి, జిల్లా నాయకులు రంగా రెడ్డి, జక్కుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండల పరిధిలోని తోట్లపల్లి పంచాయతీ ఉన్న అంబేడ్కర్ మహా గురుకుల పాఠశాలలో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేపట్టి మందులను అందజేశారు అదేవిధంగా ప్రస్తుతం వర్ష భావాల భాగంగా విద్యార్థులు విష జ్వరాలు సోకకుండా వైద్య పరీక్షలను వైద్యాధికారులు, అదేశాల మేరకు హెల్త్ సూపర్వైజర్ పుష్ప రాజ్, వారి సిబ్బందితో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేపట్టారు విద్యార్థు లు చేతులు శుభ్రతను పాటించి ప్రతిరోజు శుభ్రంగా స్నానం చేసి ఆ పరిశ్రమ ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడు విద్యార్థులు కూడా ఆరోగ్యంగా ఉంటారని అపరశుభ్రంగా ఉన్నప్పుడు విద్యార్థులు అనారోగ్యానికి గురవుతారని మరుగుదొడ్లు వెళ్లినప్పుడు తమ రెండు చేతులను శుభ్రపరచుకోవాలని సూచించారు. ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర రావు, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, పాఠశాల సిబ్బంది విజయ తుల్లా, గురురత్నం, ప్రవీణ్ తిరుపాల్ అశోక్‌కుమార్, మహేంద్ర ఓబులేసు మహేష్, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలమయం.. గుండెల్లో భయం

- అధ్వానంగా కర్ణాటక సరిహద్దు రోడ్డు

విశాలాంధ్ర-పెద్ద తిప్పసముద్రం: మద్దయ్యగారిపల్లి నుండి చేలూరు వెళ్లె రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డులో ఎక్కడ చూసినా గుంతలు పడడంతో వర్షాకాలంలో గుంతల్లో నీరు చేరడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డు కర్ణాటక సరిహద్దు రోడ్డు కావడంతో ప్రతినిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు జరుగుతుంటాయి. అత్యవసర సమయంలో 108వాహనం సమయానికి గ్రామా లకు వెళ్లలేకపోతోంది. దీంతో ప్రత్యామ్నాయ మార్గం లేక వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు వాపోతున్నారు.

సంక్షిప్త వార్తలు

మున్సిపల్ కమిషనర్‌గా రవి

విశాలాంధ్ర-రాయచోటి: రాయచోటి మున్సిపల్ కమిషనర్‌గా రవి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదీలలో భాగంగా రాయచోటి కమిషనర్‌గా పని చేస్తున్న వాసు బాబు నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో టిపిఆర్వోగా బదిలీ కావడంతో ఏపి గ్రీనరి, బ్యూటిఫికేషన్‌లో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తూ మునిసిపల్ కమిషనర్‌గా రాయచోటికి బదిలీపై వచ్చారు. ఈయన గతంలో తాడిపత్రి, మదనపల్లి, ఆముదాలవలస కమిషనర్‌గా విధులు నిర్వహించారు.

ఎయిడ్స్ పట్ల ప్రజలను చైతన్యవంతులను చేద్దాం

విశాలాంధ్ర-రాయచోటి: సమాజంలోని ప్రజలను చైతన్యవంతులను చేద్దాం, ఎయిడ్స్ వ్యాధిని అంతం చేద్దామని డాక్టర్ హైదర్ అలీ అన్నారు. రాయచోటి పట్టణం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏపి ఎయిడ్స్ నిర్మూలన, నియంత్రణ మండలి డాక్టర్ రమేష్ బాబు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఎయిడ్స్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎయిడ్స్ వ్యాధి అంతం చేయడానికిఎంతో కృషి చేస్తుందన్నారు. సమావేశంలో పిఎస్ఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ గడికోట చెన్నారెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ తమ సిబ్బంది ఎయిడ్స్ వ్యాధి పట్ల, సుఖ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ఎయిడ్స్ వ్యాధి స్లోగన్లు డిస్ప్లే చేశారు. జిల్లాలోని ఎన్జీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా వెంకటేష్

విశాలాంధ్ర-పీలేరు: అన్నమయ్య జిల్లా సిపిఐ రెండవ మహాసభలు మదనపల్లి పట్టణంలో అంగరంగ వైభవంగా జరిగాయి ప్రతినిధుల సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకో వడం జరిగింది అందులో పీలేరు నియోజక వర్గ కార్యదర్శి టివిఎల్ వెంకటేష్ ను జిల్లా కార్యవర్గ సభ్యుడుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవ దం జరిగింది ఈ సందర్భంగా టివిఎల్ వెం కటేష్ మాట్లాడుతూ ఈమధ్య కాలంలో జిల్లా లో ప్రజా సమస్యల పైన అలుపెరగని పోరా టాలు చేశానని అందుకు గుర్తించిన రాష్ట్ర నాయకత్వం రెండవసారి కార్యవర్గ సభ్యుడుగా ఎన్నుకోవడం జరిగిందన్నారు పీలేరు నియోజ కవర్గంలో ప్రజా సమస్యల పైన నిరంతరం పోరాటం కొనసాగిస్తామని ఆయన తెలియ జేశారు కొంతమంది ప్రజలు సమ స్యలతో కొట్టుమిట్టాడుతూ అధికారులు సమస్యలు పరిష్కరించకపోతే వారు ఎవరికి చెప్పుకోవాలో తెలియక సిపిఐ ఒకటి ఉంది అని పీలేరు నియోజ కవర్గంలో నా వద్దకు వస్తున్నారని వారి సమస్యల పట్ల చిత్తశుద్ధితో ఎవరు ఎన్ని నిర్బంధాలు నామీద పెట్టిన భయపడకుండా పేదల పక్షాన నిటారుగా నిలబడతానని దొంగ కేసులుకు భయపడకుండా పోరాడతానని ఆయన తెలియజేశారు జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నందుకు జిల్లా పార్టీకి రాష్ట్ర పార్టీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

సహకార సంఘాలకు ఛైర్మన్‌ల నియామకం

- సున్నపురాళ్లపల్లెకు గోపాల్ రెడ్డి.. తిప్పలూరుకు బంగారు రెడ్డి..

విశాలాంధ్ర-యర్రగుంట్ల: మండలంలోని సున్నపురాళ్లపల్లె, తిప్పలూరు సహకార పరపతి సంఘాలకు ఛైర్మన్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సున్నపురాళ్లపల్లె సంఘానికి (త్రిసభ్య కమిటీ) ఛైర్మన్‌గా మల్లు గోపాల్ రెడ్డి సభ్యులుగా కొప్పాల సుధీర్ కుమార్, పవన్ కుమార్ రెడ్డి, తిప్పలూరు సంఘానికి ఛైర్మన్‌గా బంగారు మునిరెడ్డి సభ్యులుగా మోపూరి మహేశ్వర్ రెడ్డి, చెవికెల రామమోహన్ రెడ్డిల నియామకం జరిగింది. వీరి ప్రమాణ స్వీకరానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. గోపాల్ రెడ్డి, బంగారు రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, నియోజకవర్గ టిడిపి బాధ్యులు భూపేష్ రెడ్డిలకు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. సహకార సంఘాల స్ఫూర్తిని నాటి వైసీపీ సర్కార్ దెబ్బతీసిందని రైతులకు సేవలందించాల్సిన సొసైటీలను రాజకీయ వేదికలుగా మార్చేసి చోద్యం చూసిందని గుర్తు చేశారు. ఫలితంగా గత ఐదేళ్లు వాటి ద్వారా రైతులకు ఎలాంటి భరోసా లభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నాయకుల సహకారంతో కర్షకుల ప్రయోజనాల కోసం పనిచేస్తామని వీరు ప్రకటించారు.

వైఎస్ఆర్సిపి జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులుగా మలతోటి నరేష్

విశాలాంధ్ర-పీలేరు: మండలంలోని అద్దవారిపల్లి పంచాయితీకి చెందిన మలతోటి నరేష్ ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులుగా నియామిస్తూ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నియామక పత్రం అందజేశారు. కలికిరి మండలం కలికిరి పట్టణంలోని అజయ్ ఫంక్షన్ హాల్ నందు సోమవారం మండల స్థాయి వైఎస్ఆర్ సీపీ విస్తృత స్థాయి సమావేశం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ, మండల, జిల్లా స్థాయి వైయస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సంధర్భంగా పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, వైయస్సార్సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, సంయుక్తంగా ఉత్తర్వులు జారీ చేసిన నియామక పత్రాన్ని మలతోటి నరేష్ కు మాజీ ఎమ్మెల్యే అందజేశారు. ప్రజలతో మమేకమై, వైయస్సార్సీపీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి చేర్చేలా, వైఎస్ఆర్సిపి బలోపేతం కోసం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే సూచించినట్లు మలతోటి నరేష్ తెలిపారు. తన పై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్ రెడ్డికి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి , ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్కెడ్ మాజీ అధ్యక్షులు నల్లారి తిమ్మారెడ్డి, రాష్ట్ర మైనారిటీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, ఏపీఎండీసీ రాష్ట్ర మాజీ డైరెక్టర్ హరీష్ రెడ్డి , వైఎస్ఆర్సిపి పచార కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ హరి ప్రసాద్ రెడ్డి , రాష్ట్ర విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర చక్రధర్ , అన్నమయ్య జిల్లా యూత్ ఉపాధ్యక్షులు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, కి వైఎస్ఆర్సిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారులు స్పందనతో పందులు గ్రామాలలో పట్టివేత

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండల పరిధిలోనే కొత్తూరు వీరభద్రపురం ప్రభుత్వ పాఠశాలలో విచ్చలవిడిగా పందులు విస్తరిస్తున్నాయని పత్రికలలో కథనాలు రావడంతో అధికారులు స్పందించి పందుల యాజమాన్యాలను హెచ్చరించడంతో వారు పందులను పట్టుకుంటే కార్యక్రమాన్ని చేపట్టారు పుణ్యక్షేత్రమైన వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయం చుట్టుపక్కల తిరుగుతూ భక్తులను ఇబ్బందులు చేస్తుండటంతో ఆలయం యాజమాన్యం కూడా ప్రత్యేకంగా చొరవ చూపించి పందుల యాజమాన్యానికి హెచ్చరికలు చేయడంతో పందులను పరిసర ప్రాంతాలలో తిరగకుండా వాటిని పట్టి వేసి ఊరు బయటకు తరలించే విధంగా చర్యలను తీసుకుంటున్నారు అదేవిధంగా కుక్కలు గ్రామాలలో తిరుగుతూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ చిన్న పిల్లలపై వృద్ధులపై దాడికి ప్రయత్నిస్తున్నాయని కుక్కలు కూడా తరలించేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు తెలియజేసున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను తరలించే విధంగా చూడాలని స్థానిక ప్రజలు తెలియజేస్తున్నారు.

ఆపన్నహస్తం కోసం వృద్ధుడి ఎదురుచూపు



విశాలాంధ్ర-పెద్ద తిప్పసముద్రం: ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్న ఓ వృద్ధుడు. పెద్ద తిప్పసముద్రం మండలం మద్దయ్య గారి పల్లి పంచాయతీ బురుజు పల్లికి చెందిన వెంకటరమణ(70) వ్యవసాయ కూలీ పనుల కోసం బయట ప్రాంతాలకు వెళ్లేవాడు కూలి ఉన్నచోటే నివసించేవాడు. దీంతో ఇతనికి ఆధార్ ఓటర్ ఐడి రేషన్ కార్డు లేదు. పలు ప్రాంతాల్లో తిరిగిన ఇతను అంగవైకల్యంతో గ్రామానికి చేరుకున్నాడు. సొంత ఇల్లు కూడా లేకపోవడంతో గ్రామస్తులు పూరి గుడిసె ఏర్పాటు చేయడంతో అందులో నివసిస్తున్నాడు. గ్రామస్తులు పెట్టిన ఆహారంతో జీవనం గడుపుతున్నాడు. ఇతనికి ప్రభుత్వం నుండి ఎలాంటి సాయం అందడం లేదు. ప్రభుత్వం గానీ దాతలు గాని ఇతని దీనస్థితిని గుర్తించి సాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. వర్షాకాలం కావడంతో పూరిగుడిసెలో చాలా ఇబ్బందులు పడుతున్నారు. నడవలేని స్థితిలో సాయం కోసం దీనస్థితిలో ఉన్నాడు.

పీలేరు పంచాయతీకి హుమాయూన్ సేవలు అమూల్యం

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు పంచాయతీకి హుమాయూన్ సేవలు అమూల్యమని పీలేరు సర్పంచ్ హబీబ్ బాషా అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అధ్యక్షతన పీలేరు పంచాయతీ బృందం మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మౌళిక సదుపాయాల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ప్రస్తుత వర్షభావ పరిస్తుతుల కారణంగా పట్టణంలో డ్రైనేజి, చెత్తచెదారం పేరుకు పోయాయని, ఇందుకు కార్మికు సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఆయా వార్డు లలో పేరుకు పోయిన చెత్త చెదరాన్ని తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ లతీఫ్, జూనియర్ అసిస్టెంట్ ప్రసాదరెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ నౌషాద్,వార్డసభ్యులుఅభిద్, ఉదయ్ కాలెషా సాంబ శివ రెడ్డి,పరమేష్ పాజహాన్పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి

- ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ

విశాలాంధ్ర-పీలేరు: ఓటర్ల జాబితాలో అవకతవకలు, అక్రమాలపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రశ్నలకు ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల.అమృత్ తేజ మంగళవారం పీలేరులో మీడియా ముఖంగా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగిన ఓట్ల అక్రమాలతో 70 స్థానాల్లో ఫలితాలు మారినట్లు తేట తెల్లమైందన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్బావ దినోత్సవం

విశాలాంధ్ర-రాయచోటి: అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని దివ్య తేజ విద్యా సంస్థల్లో నిర్వహించు కోవడం జరిగింది. ముఖ్య అతిథులుగా విచ్చేసి జెండా ఆవిష్కరణ చేసిన వామపక్ష భావాజాలం కలిగి రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం ఉద్యమం చేసిన వ్యక్తి దివ్య తేజ విద్యాసంస్థల డైరెక్టర్ నాగేశ్వరావు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాయచోటి పట్టణ నాయకులు లోకేష్, సబీర్, నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కందుల శివానందరెడ్డి జ్ఞాపకార్థం రిమ్స్‌లో అన్నదానం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : మాజీ ఎమ్మెల్యే కందుల శివానందరెడ్డి గారి జ్ఞాపకార్థం , అన్నం పరబ్రహ్మ స్వరూపం అనే భావనతో, కడప రిమ్స్ నందు ప్రతి మంగళ వారం మరియు శుక్రవరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని కందుల విద్యా సంస్థల అధినేత డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి తెలిపారు. రిమ్స్‌లో మార్చురి వార్డ్ దగ్గర్లో గల మెంటల్ రిహాబిలిటేషన్ సెంటర్ నందు గల 70 మందికి అదనంగా భోజన పొట్లాలు పంచుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తమ విద్యా సంస్థలో చదువుతున్నా వివిధ బ్రాంచ్ లో చదువుతున్న విద్యార్థులు, 10 మంది వరకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రతీ వారం భోజన ప్యాకెట్ ప్యాకింగ్ మరియు వితరణ సమయానికి రిమ్స్ నందు సహకరిస్తున్నారు అని తెలిపారు.

ఆటో బోల్తా-వృద్ధురాలు మృతి

విశాలాంధ్ర-మదనపల్లె: ఆటో బోల్తా పడటంతో వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. బొమ్మనచెరువు పంచాయతీ, టేకులపాళ్యం సమీపం లోని పందివానిపల్లికి చెందిన లేట్ వెంకటరమణ భార్య చిన్న పాపమ్మ (70) బొమ్మను చెరువు సచివాలయం వెళ్లేందుకు ఆటో ఎక్కింది. మార్గమధ్యంలోని మందబండ వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో చిన్నపాపమ్మ తీవ్రంగా గాయపడగా డ్రైవర్ రామిరెడ్డి స్వల్పంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితులను 108లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చిన్న పాపమ్మ మృతి చెందినట్లు తెలిపారు. గాయపడిన రామిరెడ్డిని ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు అవార్డుల ప్రదానం

విశాలాంధ్ర-కడప రూరల్: విద్యార్థులలోని ప్రతిభా పాటవాలను ప్రోత్సహించి భావి సమాజంలో వారు కీలక పాత్ర నిర్వహించాలనే ఆశయంతో ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు వారు ఏటా సభ్యులు, ఉద్యోగుల పిల్లలలో పదో తరగతి, ఇంటర్మీడియట్, ఎంసెట్, నీట్ పరీక్షలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తున్నారు. ఈ దఫా జరిగిన పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు బహుమతులు ప్రకటించారు. కడప విసిబిఎల్ బ్యాంక్ "ప్రతిభ అవార్డుల" ప్రదానోత్సవం కడప బ్రాంచ్ ప్రాంతం నుండి 3అత్యుత్తమ విద్యార్థులను సత్కరించారు. పదవ తరగతి విద్యార్థి మేడసరి గంగ తేజస్విత రూ.5వేలు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం అందజేశారు. ఇంటర్మీడియట్ ఇద్దరు విద్యార్థులకు షేక్ మారియం, మిధ్య వేంకట నాగ వర్ధన్ రూ.7,500 నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రంతో అభినందించడం జరిగింది. మంగళవారం కడపలోని శంకరాపురం బ్రాంచ్ కార్యాలయంలో ఈ బహుమతి ప్రధాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సమావేశానికి జోనల్ మేనేజర్ కే వెంకటేసు, కడప బ్రాంచ్ మేనేజర్ తులసి కుమార్, కమిటీ సభ్యులు డాక్టర్ సంజీవమ్మ , కేసీ.బాదుల్లా, గణేష్, కే నిత్య పూజయ్య ఈ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మిట్స్‌లో ఘనంగా యాంటీ ర్యాగింగ్ డే

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లె సమీపంలోని మిట్స్ (మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్) డీమ్డ్ టూ బీ యూనివర్సిటీలో ఎంఎస్అర్ (మిట్స్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) క్లబ్ వారి ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్ డే ను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధి డాక్టర్ అర్. కల్పనా మాట్లాడుతూ మన దేశంలోని ఉన్నత విద్యావ్యవస్థలో ర్యాగింగ్ అనేది కలవరపెట్టే వాస్తవం అని అన్నారు. ఒకప్పుడు పాఠశాల, కళాశాల అనే బేధం లేకుండా ప్రతి విద్యాలయంలో ఉండేది. దీనికి ఎంతో మంది విద్యార్థులు బలయ్యారు. అందుకే దీన్ని నిరోధించడానికి ప్రత్యేకంగా చట్టాలు సైతం తీసుకొచ్చారు. యూనివర్సిటీలో యాంటీ ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేసి, ప్రతి మూడు నెలలకు ఒకసారి వసతి గృహాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. యూనివర్సిటీ ప్రాంగణంలో విద్యార్థుల అవగాహన కోసం యాంటీ ర్యాగింగ్ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ లోని సాక్ కోఆర్డినేటర్ డాక్టర్ రెడ్డి హేమంత, యాంటీ ర్యాగింగ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ చంద్ర మోహన్, శాయిాజ్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

విశాలాంధ్ర - బద్వేలు : స్థానిక జేవీ భవన్లో సిపిఐ పార్టీ సమావేశంలో రాష్ట్ర మహాసభ లకు సంబంధించిన మంగళవారం పోస్టర్ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ ఈనెల 23 నుండి 25 వరకు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 28వ రాష్ట్ర మహాసభలో ఒంగోలు పట్టణం నందు జరుగుతున్నాయని ఈ మహాసభలకు ఇంటికి ఒక మనిషి శాఖకు ఒక బండి చొప్పున పార్టీ సభ్యులు పార్టీ సానుభూతిపరులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఈ మహాసభలు 11 సంవత్సరాలుగా ఈ దేశాన్ని పరిపాలిస్తున్న బిజెపి సాగిస్తున్నటువంటి ప్రజా వ్యతిరేక విధానాల పాలకు వ్యతిరేకంగా జరుగుతున్నాయని దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని కూడా సంపన్న వర్గాలకు కట్టుపెడుతున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దతించడానికి ప్రజల సన్నద్ధం కావాలని దేశంలో నిరుద్యోగ వ్యవస్థ పెరిగిపోయి కులం పేరుతో మతం పేరుతో ప్రాంతం పేరుతో ప్రజల ఐక్యతను దెబ్బతీసి ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తుందని ఇందుకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఐక్యమై పెద్ద ఎత్తున మహాసభలలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ పట్టణ కార్యదర్శి బాలు ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్ ఏరియా కార్యవర్గ సభ్యులు పివి రమణ పాడిన వెంకటరమణ ఇమ్మానియేల్ పెంచలయ్య విజయమ్మ సునీల్ ప్రసాద్ నాగరాజ్ నాగేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన గల్ఫ్ ఎన్ఆర్ఐ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్లోబల్ ఎన్.ఆర్.ఐ కన్వీనర్ ఏ. సాంబశివ రెడ్డి ఆధ్వర్యములో గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ తో కలిసి గల్ఫ్ అడ్వైజర్ నాయని మహేశ్వర్ రెడ్డి, కువైట్ కో కన్వీనర్ మన్నూర్ చంద్రశేఖర్ రెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు పులపుత్తూర్ సురేష్ కుమార్ రెడ్డి, అడ్వైజర్ ఆరవ సుబ్బారెడ్డిలు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని మంగళ వారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు తాత్కలిమే చంద్రబాబు చెప్పిన మోసాపూరిత వాగ్దానాలు నమ్మి ప్రజలుమోసాపోయారు వాళ్ళు రాజకీయ కక్షలతో తమ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసి రాక్షసానందం పొందుతున్నారు. దేవుడున్నాడు తప్పక జగనన్న కు మంచే జరుగుతుంది అని తెలిపారు.

అదిత్యలో యువర్ వాయిస్ యువర్ పవర్‌పై

అవగాహన సదస్సు

విశాలాంధ్ర-మదనపల్లె: పుంగనూరు రోడ్డు లోని మదనపల్లె ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా హ్యూమాని టీస్ అండ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో యువర్ వాయిస్ యువర్ పవర్, డెవలపింగ్ కమ్యూనికేషన్ అండ్ లీడర్షిప్ అవగాహన కార్యక్ర మం అనే అంశంపై మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బెంగళూరు ప్రెసిడెన్సీ యూనివర్సిటీ ఆంగ్ల విభాగం ప్రొఫెసర్ ఎస్‌వి నరసింహ మూర్తి ప్రధాన అతిథిగా హాజరై, విద్యార్థులకు సమర్థవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాల ప్రాముఖ్యతపై ప్రేరణాత్మక ప్రసంగం అందించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్. రామలింగ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆలోచనలను ధైర్యంగా వ్యక్తపరచడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, బృందస్ఫూర్తితో పనిచేయడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానాలు సాధించగలరని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్, డాక్టర్. రాయుడు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రాధాన్యమున్న యుగంలో విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం, భాషా పటిమను పెంపొందించు కోవాలని సూచించారు. హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ అమరనాథ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఈ తరహా కార్యక్ర మాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విబాగాఅధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యా యత్నం

విశాలాంధ్ర-మదనపల్లె: కుటుంబ సమస్యలతో గొడవ పడిన మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ సంఘటన మంగళవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు నీరుగట్టువారి పల్లి, మారుతినగర్ కు చెందిన వెంకటేష్ భార్య కృష్ణమ్మ (44) కుటుంబ సమస్యలపై గొడవ పడింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని వెంటనే కిందికి దింపి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్బావ దినోత్సవం

విశాలాంధ్ర-కడప రూరల్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కడప పట్టణంలో హెూచిమిన్ భవన్, స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్ద ఘనంగా నిర్వహిం చారు. కడప పట్టణంలో ఉన్న ఈ స్థూపాల వద్ద మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు కామ్రేడ్ గాలి చంద్ర, కామ్రేడ్ వెంకట శివ, కామ్రేడ్ కేసి బాదుల్లా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. చంద్ర మాట్లాడుతూ విద్యాసంస్థల్లోకి విద్యార్థి నాయకులు రాజకీయ పార్టీలు అనుమతులేదని తీసుకువచ్చిన జీవోలు ఎవరికోసం ఎవరి లబ్ధి కోసమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గర్ల్స్ కన్వీనర్ నిఖిత, కడప నగర అధ్యక్షులు అఖిరా నందన్, ఉపాధ్యక్షులు అశోక్, పులివెందుల నియోజకవర్గ కార్యదర్శి వెంకట్ రెడ్డి, నాయకులు సాగర్, మదన్, వీరు, చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

దేశద్రోహుల తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : నాటి దేశద్రోహుల తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని ఏఐఎస్ఎఫ్ మాజీ సీనియర్ నాయకులు తుమ్మల రాధాకృష్ణ పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం సిపిఐ నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్ద సిపిఐ మండల కార్యదర్శి డి రాజశేఖర్ అధ్యక్షతన ఏఐఎస్ఎఫ్ జెండాను రాధాకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 ఆగష్టు 1936 లో ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో బెనారస్ విశ్వవిద్యాలయంలో ఆవిర్భవించిందన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో ఏఐఎస్ఎఫ్ కీలక పాత్ర పోషించిందన్నారు. బ్రిటిష్ నియంతృత్వ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించిందన్నారు. 90 ఏళ్లుగా ఏఐఎస్ఎఫ్ అలుపెరుగని పోరాటాలు చేసిందన్నారు. సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి తుమ్మల కృష్ణచైతన్య మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ ఉద్యమాలలో ఉద్భవించి, పోరాటాలలో రాటుదేలి, సామ్యవాద సమాజ స్థాపన కోసం అవిరళ త్యాగాలతో ఉద్యమాన్ని నిర్మిస్తున్న ఏకైక ఏఐఎస్ఎఫ్ అన్నారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, నియోజకవర్గ కంట్రోల్ ప్యానెల్ సభ్యులు ఎన్ యానాదయ్య, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు మనోజ్ యాదవ్, శీను, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు నరసయ్య, షిర్డీ సాయి విద్యార్థులు తదితరులు ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాత పింఛను ప్రభుత్వం అమలు పరచాలి:ఎస్టీయు



విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సిపిఎస్ కమిటీ కన్వీనర్ యు.సుబ్రమణ్యం పాత్రికేయ మిత్రులతో మాట్లాడుతూ 2023 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57 ద్వారా రాష్ట్రంలో సుమారుగా 11,000 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాతపింఛన్ స్కీమును అమలు పరచకుండా గత, ప్రస్తుత ప్రభుత్వాలు కాలయాపన చేయడం చాలా భాధాకరం. తక్షణమే 1-9-2004కు ముందు నియామకం పొందిన వారికి ఓల్డ్ పింఛన్ స్కీమ్‌ను అమలు చేయాలన్నారు. ద్వారా జీవో నెంబర్ 107 గ్రాడ్యుటీ, జీవో నెంబర్ 121 ద్వారా ఫ్యామిలీ పింఛను సంపాదించుకొన్నము. అదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో పాత పింఛను సాధించే దిశగా ప్రతి ఒక్క సిపిఎస్ ఉద్యోగి అంకితభావంతో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు.

సహకార సంఘం చైర్మన్‌కు ఘన సన్మానం

బీసీ సెల్ అధికార ప్రతినిధి సుబ్రహ్మణ్యం, మణికంఠ

విశాలాంధ్ర-చెన్నూరు: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ముండ్ల శ్రీనివాసరెడ్డిని స్థానిక బీసీ సెల్ అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రహ్మణ్యం, ఐ టీడీపీ చాంపియన్ యామల మణికంఠలు ఘనంగా సత్కరించారు. మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్న వయసులోనే మంచి పేరున్న నాయకునిగా శ్రీనివాసులు రెడ్డి గుర్తింపు తెచ్చుకున్నాడని, చిన్న వయసులోనే మంచి పదవిని పొంది అందరి దృష్టిని ఆకర్షించాడు అన్నారు. కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీలో కష్టపడి పని చేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుంది అనడానికి ఇది ఒక నిదర్శనమని వారు పేర్కొన్నారు. పదవి రావడానికి దించిన మా నాయకులు పుత్త నరసింహారెడ్డి, ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఎన్నో ఉన్నతమైన పదవులు పొందాలని ప్రజలకు మరింత సేవ చేసి మంచి గుర్తింపు పొందాలని వారు ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో అల్లాడు రాజశేఖర్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

అరుదైన ఘనత సాధించి బీరం కళాశాల విద్యార్థులు

విశాలాంధ్ర-చెన్నూరు/ఖాజీపేట : ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ గౌహతి - అస్సాం వారు నిర్వహించిన అంతర్జాతీయ పాఠశాల ఛాంపియన్షిప్ పరీక్షలో బీరం శ్రీధర్ రెడ్డి కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ఎన్. సుదీప్ రెడ్డి, మరియు ఎం. వెంకట కార్తీక్ అనే విద్యార్థులు ఆలిండియా స్థాయిలో మూడవ ర్యాంకు సాధించారు. మరియు వీరు ఐఐటీ గౌహతి ఇనిస్టిట్యూట్లో అక్టోబర్లో జరగబోయే మెయిన్స్ ఎగ్జామ్కు ఎంపిక కావడం జరిగింది. బీరం కరస్పాండెంట్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ సాధించాలన్న ఆలోచన మనలో ఉన్నంతకాలం ఎన్ని అడ్డంకులు వచ్చినా విజయాన్ని ఎవరు ఆపలేరు అని అన్నారు. జాతీయస్థాయిలో తమ విద్యార్థులు మూడవ ర్యాంకు సాధించడం చాలా గొప్ప విశేషమని తమ పాఠశాల పేరు భారతదేశ కీర్తి పతాకంపై ఎగురుతుందని తెలియజేశారు. బీరం కళాశాల పూర్వ విద్యార్థులు ఇండియాలో ఉన్న రకరకాల ఐఐటి కళాశాలలో సాధించిన ర్యాంకుల గురించి చెప్పారు. కార్యక్రమంలో బీరం విద్యాసంస్థల డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ హేమ్ చందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా

కమ్యూనికేషన్ స్కిల్స్ కార్పొరేట్ రంగంలో ఎంతో అవసరం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరం లోని. కె ఎస్ ఆర్ ఎమ్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థుల కోసం ఇండక్షన్ ప్రోగ్రామ్లో భాగంగా, ఆగస్టు 12, 2025న ఎస్ జె బ్లాక్ సెమినార్ హాల్లో "కార్పొరేట్ శిక్షణ"పై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అనుభవజ్ఞులైన కార్పొరేట్ శిక్షకుడు మరియు వృత్తిపరమైన అభివృద్ధి మరియు కార్పొరేట్ రంగంలో సంవత్సరాల అనుభవం ఉన్న పరిశ్రమ నిపుణుడు చంద్ర శేఖర్ గొల్లపూడి ప్రసంగించారు. దాదాపు 250 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సెషన్ యొక్క లక్ష్యం ఫ్రెషర్లకు కార్పొరేట్ ప్రపంచం యొక్క అంచనాలపై అవగాహన అందించడం మరియు విద్యా అభ్యాసం మరియు వృత్తిపరమైన అవసరాల మధ్య అంతరాన్ని తగ్గించడంలో వారికి సహాయపడటం. కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పని నీతి, సమయ నిర్వహణ మరియు నిరంతర అభ్యాసం యొక్క ప్రాముఖ్యతపై విలువైన దృక్పథాలను గొల్లపూడి విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమానికి హెచ్ అండ్ ఎస్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ వి. రామ చంద్రారెడ్డి, ఇండక్షన్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు డాక్టర్ టి. రమేష్ బాబు మరియు ఎం. మేరీ జాస్మిన్ మరియు అధ్యాపకులు హాజరై, చంద్రశేఖర్ గొల్లపూడి ప్రసంగానికి అభినందనలు తెలిపారు. ఈ సెషన్ను ఫస్ట్ ఇయర్ బి.టెక్ ఇండక్షన్ ప్రోగ్రామ్ కమిటీ సమన్వయం చేసింది మరియు హాజరైన వారందరి నుండి మంచి ఆదరణ లభించింది.

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర - బద్వేలు : పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జేఏసీ ఛైర్మెన్ ఏపీ ఎన్జీజీవో బద్వేల్ తాలూకా అధ్యక్షుడు టి.నరసింహారెడ్డి అన్నారు. పట్టణం లోని మంగళవరం డిపో గేట్ వద్ద జాతీయ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ అధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతు పెండింగ్‌లో నున్న నాలుగు డీఏ తక్షణమే చెల్లించలన్నారు. వెంటనే ఐ.ఆర్ ప్రకటించాలన్నారు. జాతీయ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జనార్ధన్ రావు మాట్లాడుతు గత నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్ లను వెంటనే కలిపించాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థల ద్వారా వేతనాలని చెల్లించాలన్నారు. తీవ్రమైన అనరోగ్యలతో బాధపడుతున్న ఉద్యోగులను ఓడీ లుగా పరిగనించలన్నారు. పై సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు ప్రభుత్వంపై డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివరామిరెడ్డి మజ్దూర్ యూనియన్ నాయకులు చిన్నప్పరెడ్డి, చంద్రయ్య , శ్రీధర్ , సుమారు రెండు వందల మందికి కార్మికులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ధర్నాలో పాల్గొన్నారు.

భూ సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలి : ఆర్డిఓ

విశాలాంధ్ర- బ్రహ్మంగారిమఠం : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో రెవెన్యూ భూ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు దృష్టి పెట్టాలని ప్రజలు రైతులు కార్యాలయాల్లో చుట్టూ తిరగకుండా పనిచేయాలని ఎక్కువ ఈ మండలంలోని భూ సమస్యలు ఉన్నాయని అన్ని సమస్యలకు త్వరలో శ్రీకారం చూస్తామని జిల్లా అధికారులు ఆదేశాలతోనే మళ్లీ భూ సర్వే కార్యక్రమాన్ని చేసేందుకు శ్రీకరం చూస్తామన్నారు అందులో భాగంగానే మంగళవారం తాహశీల్దార్ కార్యాలయంలోని రెవెన్యూ సమస్యల పైన తాహశీల్దార్ కార్తిక్ కలిసితో సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు ప్రస్తుతం జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ సర్వేలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఆ పంచాయతీలో పనిచేసే విఆర్వోలు సర్వేలు రైతుల యొక్క సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని తమ దృష్టికి వస్తున్నాయని అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా రైతులకు న్యాయం జరిగే విధంగా చూడాలని వారు సూచించారు అందులో భాగంగానే మల్లేపల్లి సర్పంచ్, భర్త చిలమల నారాయణ యాదవ్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మల్లెపల్లి పంచాయతీ భూములు కోల్పోయిన రైతులు సమస్యలను ఆర్డిఓ దృష్టికి తీసుకెళ్లి భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నుండి వచ్చే నష్టపరిహార డబ్బులను రైతులకు ఖాతాలో జమ పడేవిధంగా చూడాలని అధికారులు కొంత రైతులను ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని ఇప్పటికే పలుమార్లు అధికారులకు సూచించామని భూమి కోల్పోయిన రైతుకు న్యాయం జరిగే విధంగా వారు సూచించారు అనంతరం నేషనల్ హైవే పనులను పరిశీలించారు ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు వీఆర్వో, తదితరులు పాల్గొన్నారు.

ఆ ఉత్తర్వులు ఎక్కడ బాబు....?

- ప్రభుత్వానికి గుంటి వేణుగోపాల్ ప్రశ్న

విశాలాంధ్ర-కడప రూరల్: అసెంబ్లీ సాక్షిగా మహిళా దినోత్సవం రోజున ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ప్రకటించిన మూడు వరాలకు ఉత్తర్వులు ఎక్కడ బాబు అని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు గుంటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షులు మరియమ్మ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికైనా హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈనెల 30, 31 కడపలో జరుగుతున్న ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహా సభలలో భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ రూపొందించుకుని చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు వరలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి: ఎఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-మదనపల్లె: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మదనపల్లి పట్టణంలో బీటీ కళాశాల ఎదుట నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకులు మహేశ్, కృష్ణప్పలు హాజరై పతాకాన్ని ఆవిష్కరించారు. ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు మహేశ్ మరియు కృష్ణప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ్‌లు మాట్లాడుతూ విద్యార్థుల హక్కులు కాలరాస్తున్న జీవోలను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు, జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్, ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా గర్ల్స్ కన్వీనర్,కో కన్వీనర్లు గంగా రాణి, భవిత మదనపల్లి నియోజకవర్గ సహాయ కార్యదర్శి సాయికిరణ్, విద్యార్థి విద్యార్థినీలు పాల్గొన్నారు

రాజంపేట మాజీ ఎమ్మెల్యే మదనమోహన్ రెడ్డి మృతికి

సంతాపం తెలిపిన స్వామి శివరామకృష్ణ నంద సరస్వతి

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : రాజంపేట మాజీ ఎమ్మెల్యే కసిరెడ్డి మదనమోహన్ రెడ్డి మృతికి ఆయనతో పాటు ఎమ్మెల్యేగా పనిచేసిన (బద్వేల్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వి. శివరామకృష్ణారావు) ప్రస్తుత శ్రీ స్వామి శివరామనంద సరస్వతి రిషికేశ్‌లోని దయానంద ఆశ్రమంలో ఉంటున్న ఆయనకు మాజీ ఎమ్మెల్యే మదనమోహన్ రెడ్డి మృతి చెందిన వార్త తెలియడంతో ఆయన మృతికి సంతాపం తెలిపారు అలాగే వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా స్వామి శివరామ నంద సరస్వతి రిషికేశ్ నుండి ఫోన్ ద్వారా మాట్లాడుతూ తాను మదనమోహన్ రెడ్డి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీలో పని చేసామన్నారు. ప్రజల కోసం ఇరువురం అనేక కార్యక్రమాలు నిర్వహించమన్నారు. ఆనాటి స్మృతులను నెమరు వేసుకుంటూ ఆయనతో ఉన్న అనుబంధాన్ని స్నేహాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. మదనమోహన్ రెడ్డి రాజకీయాల్లో ఎంతో ఉత్తముడని ప్రజల కోసం కష్టపడి పని చేసే వారిని ఆయన తెలిపారు. ఆయన మరణం రాజంపేట ప్రజలకు తీరని లోటుగా స్వామి పేర్కొన్నారు.

నాసిరకంగా నేషనల్ హైవే పనులు

- సిపిఐ ప్రసాద్ హెచ్చరిక

విశాలాంధ్ర-కడప: జమ్మలమడుగు ప్రాంతంలో నిర్వహిస్తున్న జాతీయ రహదారి పనులలో నాసిరకంగా జరుగుతున్నాయని సిపిఐ నియోజ కవర్గ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ శ్రీనివాసులు రెడ్డికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. వారు మాట్లాడుతూ జాతీయ రహదారి పనులు నాసిరకంగా జరుగుతు న్నాయని. ఎక్కడపడితే అక్కడ గుంతలు తొవ్వి గ్రావెల్, మెటల్‌తో పని జరుపుతు న్నారన్నారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు పనులను పర్య వేక్షించి పనులు చేపట్టే కంపెనీ పైన పర్యవేక్షిస్తున్న అధికారుల పైన చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని. ఎక్కడికక్కడ పనులు అడ్డుకుంటామని వారు సంబంధిత అధికారులను హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి రాంప్రసాద్ సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్ల మోడీ గద్దె దిగాలి

విశాలాంధ్ర-మదనపల్లి: దొంగ ఓట్లతో గద్దెనెక్కిన మోడీ వెంటనే రాజీనామా చేసి గద్దె దిగిపోవాలని, విడుదలై చిరుతైగల్ కట్చి (వీసీకే పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం శివప్రసాద్ డిమాండ్ చేసారు. మంగళవారం స్థానిక బాస్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ బయట పెట్టిన ఓట్ల దొంగతనం మీద సుప్రీం కోర్ట్ సిట్టింగ్ జడ్జిల చేత విచారణ జరిపించాలని చెప్పారు. అంబేద్కర్ పౌరులకు ఇచ్చిన ఓటు హక్కును బిజెపి దొంగతనం చేస్తున్నదని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోపాటు 300 మందికి పైగా ఎంపీలు చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. ఈ సమావేశంలో వీసీకే పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాల మోహన్, భారతీయ అంబేద్కర్ సేన నాయకులు జి. గంగులప్ప, వై. గంగాధర్, సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఒక మాత్రతో నులిపురుగులను నివారిద్దాం

విశాలాంధ్ర - బద్వేలు : మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల తిరువెంగళపురం ఉన్నత పాఠశాల పర్యవేక్షణలో భా గంగా అన్ని ప్రభుత్వ,ప్రైవేట్, అంగ న్వాడి సెంటర్ నందు జాతీయ నులిపురుగుల దినోత్సవం నిర్వహిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.రాజేష్ కుమార్ మాట్లాడుతూ నులిపురుగుల నివారణ కోసం కేంద్ర ప్రభుత్వము రాష్ట్ర ప్రభుత్వము సంయుక్తముగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ ప్రోగ్రామ్ను నిర్వహిస్తుందన్నారు. మండల విద్యాధికాణి ప్రమీలమ్మ మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఈ మాత్రలు మింగించడం వలన నులిపురుగులు ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందకుండా కాపాడుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. రాజేష్ కుమార్ డాక్టర్ జె. వినయ్ కుమార్ డాక్టర్.సౌమ్య మండల విద్యాధికారిని డాక్టర్ ప్రమీల శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు, ఉపాధ్యాయులు, బద్వేల్ సబ్ యూనిట్ ఆఫీసర్ టీ నర్సింహారెడ్డి, డిప్యూటీహెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి వెంగయ్య హెల్త్ అసిస్టెంట్ జనార్ధన్, శిరామయ్య మరియు ఆరోగ్య సిబ్బంది లక్ష్మీదేవి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మార్ట్‌గా.. రేషన్ కార్డులు

- త్వరలో పంపిణీకి ఏర్పాట్లు
- నూతనంగా 1500కార్డులు

విశాలాంధ్ర-యర్రగుంట్ల: ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత కోసం కూటమి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులను జారీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వీటిని ముద్రించి ఈ నెలాఖరులోగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. గత వైకాపా ప్రభుత్వంలో ఇచ్చిన బియ్యం కార్డులను ఆ పార్టీ రంగుల్లో ముద్రించారు. ఒకవైపు వైయస్ రాజశేఖర్ రెడ్డి ,మరోవైపు జగన్మోహన్ రెడ్డి చిత్రాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం కొత్తగా ఇవ్వనున్న కార్డులు క్యూఆర్ కోడ్‌తో డ్రైవింగ్ లైసెన్స్ కార్డు పరిమాణంతో ఉంటాయి. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారుడి ఫోటో, పుట్టిన తేదీ, చిరునామా, రేషన్ కార్డు, దుకాణం నంబర్లు ,వెనుక వైపు లబ్ధిదారుల కుటుంబ సభ్యుల వివరాలు ఉంటాయి. కార్డులో ప్రత్యేక చిప్ ఉంటుంది. రేషన్ దుకాణానికి వెళ్లిన తర్వాత డీలర్ వద్ద ఉండే పరికరంలో ఏటీఎం కార్డులా వాడొచ్చు. గుర్తింపు కార్డు గానూ వినియోగించుకోవచ్చు. మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) లోను రేషన్ కార్డులకు దరఖాస్తు సేవలందించనున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రకటించారు. వాట్సాప్ నంబర్ 9552300009లో బియ్యం కార్డు సరెండర్, చేర్పులు, తొలగింపులు, తప్పులు సరి చేయడం, నూతన కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చు. కొత్త రేషన్ కార్డులు, చేర్పులు, మార్పులకు చివరి తేదీ అనేది లేదు. దీంతో ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. వివాహ ధ్రువీకరణ పత్రం, పెళ్లి ఫోటో కూడా అవసరం లేదు. అర్హులు అయితే 21 రోజుల్లో రేషన్ కార్డు మంజూరు చేయనున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్ కార్డ్ ప్రామాణికం కావడంతో మూడేళ్లగా పలు కుటుంబాలు వీటి కోసం నిరీక్షిస్తున్నాయి. వైకాపా ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించడంతో కుటుంబం నుంచి వేరుపడిన వారు, వివాహమైన కొత్త దంపతులు బియ్యం కార్డులు పొందేందుకు వీలు లేకుండా పోయింది. పేర్లు తొలగింపు, కొత్తగా పిల్లల పేర్లు చేర్పునకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం ఆ చిక్కులు తొలగిస్తూ అన్నింటికి అవకాశం కల్పించింది. మే 7 నుంచి అన్ని సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. దరఖాస్తు చేసుకున్న 21 రోజుల వ్యవధిలో వారి వివరాలు ఆన్లైన్ చేసి, లాగిన్ కు వచ్చిన వెంటనే ఈ కేవైసీ పూర్తి చేసి కార్డు మంజూరుకు చర్యలు తీసుకుంటోంది. ఎర్రగుంట్ల పురపాలిక, గ్రామీణ ప్రాంతాల్లో ఈమారు సుమారు 1500 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరగనుంది.

పుల్లయ్య మరణం కళారంగానికి తీరని లోటు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: చెక్కభజన, కులుకు భజన, జడకోపు, కోలాటాల్లో అత్యంత నిపుణులుగా ప్రసిద్ధి చెందిన సగిలి పుల్లయ్య మరణం కళాకారులకు తీరని లోటని యోగివేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. కడప సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఇటీవల మరణించిన చెక్కభజన కళాకారుడు పుల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ కలసపాడు మండలం, లింగారెడ్డి పల్లె హృదయ పేటలో 1959లో పుల్లమ్మ, ఓబయ్య దంపతులకు జన్మించిన పుల్లయ్య కేవలం 16 సంవత్సరాల వయస్సులోని చెక్కభజనలో తర్ఫీదు పొంది గురువుగా మారారన్నారు. బ్రహ్మంగారిమఠంలో ఏకధాటిగా 24గంటలు చక్కభజన ప్రదర్శించి అరుదైన రికార్డు సృష్టించారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి పుల్లయ్యను కీర్తిస్తూ చక్కని పాటను రాసి ఆలపించారు. కార్యక్రమంలో రమేష్, రాజారెడ్డి, మౌనిక, వెంకటరమణ, హరికృష్ణ, శ్రీనివాసులు, సుమతి, అరుణకుమారి, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పాలన.. లేక నియంత పాలన

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: ఇప్పుడు మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగేది ప్రజాస్వా మ్యం పాలన లేక నియంత పాలన అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎన్‌డి విజయ జ్యోతి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పులివెందుల, ఒంటిమిట్ట మండలాల్లో అక్రమ పద్ధతిలో అపహాస్యంగా జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించారని ఇది చట్టాన్ని ఉల్లంఘించడమేనని ఆమె తెలిపారు. రాబోయే 2029 ఎలక్షన్లో కాంగ్రెస్ పా ర్టీ అధికారంలోకి వస్తుందని రాహుల్ గాం ధీ ప్రధానమంత్రి అవుతారని అప్పుడు రాజ్యాంగం దాని విలువల గురించి ఆయన సక్రమమైన రీతిలో పెడతారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైయస్ షర్మిలారెడ్డి ముఖ్యమంత్రి అయి తీరుతారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్‌డి విజయ జ్యోతి తెలిపారు.

చిన్నపిల్లలకు జారుడుబండలు వితరణ

విశాలాంధ్ర-సుండుపల్లె: మండల కేంద్రంలోని సుండుపల్లె ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో గల అంగన్వాడీ కేంద్రానికి 'మానవత సంస్థ' డైరెక్టర్ మరియు ఉపాధ్యాయుడు అయినటువంటి రవీంద్రనాథరెడ్డి ఒక జారుడుబళ్ళను విరాళముగా ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖధికారి రవినాయక్, ఆర్థిక కార్యదర్శి నరసింహ, సభ్యులు సుధాకర్ రెడ్డి, నారాయణ నాయక్, ప్రకాష్ నాయక్, రజని పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర-పులివెందుల: పిల్లలపై ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకుని పులివెందుల అర్బన్ పరిధిలోని జయమ్మ కాలనీ అంగన్వాడీ కేంద్రం, వేముల హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ జరుగుతున్న నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని పర్యవేక్షించి, సిబ్బందికి సమగ్ర సూచనలు అందించారు. పిల్లలకు నులిపురుగులు వ్యాపించకుండా ఉండేందుకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆహారపు అలవాట్లు, గోర్లు కత్తిరించుకోవడం, చేతులు కడుక్కోవడం, వండిన ఆహారాన్ని మాత్రమే తినడం వంటి ముఖ్యమైన జాగ్రత్తల గురించి పిల్లలకు వివరించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి, ప్రభుత్వ ఆరోగ్య సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పులివెందుల జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్:ఖాజా మొద్దీన్, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, డాక్టర్: శాంత కుమార్, డాక్టర్: శరణ్య, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, ఎపిడెమియాలజిస్ట్ : ఖాజా మొద్దీన్ స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టండి

- కమిషనర్ మనోజ్ రెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: నగరంలో కురుస్తున్న వర్షం వలన ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కడప నగరపాలక కమిషనర్ ఎన్ మనోజ్ రెడ్డి మధ్యాహ్నం విసిట్ లో భాగంగా 31/1 మరియు 31/2 బ్రాహ్మణ వీధి సచివాలయమును విజిట్ చేశారు. సచివాల సిబ్బంది యొక్క అటెండెన్స్ చెక్ చేయడం జరిగింది. విధులపై బయటికి వెళ్ళినప్పుడు మూమెంట్ రిజిస్టర్ నందు ఎంటర్ చేసి వెళ్లవలసిందిగా ఆదేశించారు. మోచంపేట మరియు మాసిమా బాబు సర్కిల్ ఏరియాలో గ్యాంగ్ వర్క్‌ను పరిశీలించారు. వర్షం వల్ల దిగువ ప్రాంతాలకు నీరు చేరటం వలన ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. అలాగనే అక్కయ్య పల్లి ప్లాజా ను పరిశీలించారు. ప్లాజా కి ఇరువైపులా చిరు వ్యాపారులను ప్రోత్సహించాలని అధికారులకు ఆదేశించారు. ఎల్ఐసి సర్కిల్ నుంచి మహావీర్ సర్కిల్ వరకు చిరు వ్యాపారులకు ఇరువైపులా రోడ్డును పరిశీలించారు. రాజీవ్ మార్గగ్ రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ విజయ్ కుమార్ రెడ్డి, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్ ఫ్రీపై అవగాహన

విశాలాంధ్ర-కడప: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రతి కళాశాలలో ర్యాగింగ్ నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించిన నేపథ్యంలో, కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున మాట్లాడుతూ ప్రతి సీనియర్ విద్యార్థి జూనియర్‌లను సోదర సోదరి భావంతో చూసి, వారిని అభివృద్ధి వైపు నడిపించాలని కోరారు. కడప వైద్య కళాశాలను ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా నిలబెట్టడం అందరి బాధ్యత అని ఆమె అన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్ కోసం ర్యాగింగ్ ఘటనలకు దూరంగా ఉండి, సఖ్యతతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో బయోకెమిస్ట్రీ విభాగానికి చెందిన డాక్టర్ లక్ష్మీ నరసమ్మ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అధిపతి డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి, అనస్థీషియా విభాగ అధిపతి డాక్టర్ సునీల్ చిరువెల్ల, డాక్టర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రతి ఒక్క భారతీయుడు జాతీయ ఐక్యత చాటే కార్యక్రమంలో పాల్గొనాలి

విశాలాంధ్ర-రాయచోటి: ప్రతి ఒక్క భారతీయ పౌరుడు జాతీయ సమగ్రత, జాతీయ ఐక్యత చాటుకునే ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. మంగళవారం ఉదయం అజాది కా అమృత్ మహోత్సవ్ లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా రాయచోటి కలెక్టరేట్ నుండి బంగ్లా సర్కిల్ వరకు జిల్లా పర్యాటక శాఖ, ప్రభుత్వ వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పచ్చ చండా ఊపి బైక్ ప్రదర్శన ర్యాలీని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా డివిజన్, మండల కేంద్రాలలో ఈ కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనే విధంగా చూడాలని అన్నారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, డిపిఓ రాధమ్మ, రాయచోటి తాసిల్దార్ నరసింహాకుమార్, జిల్లా పర్యాటక శాఖ నాగభూషణం, జిల్లా అధికారులు, విద్యార్థిని, విద్యార్థులు, ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించాలి

- జిల్లా ప్రాజెక్టు మేనేజర్

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: వ్యవసాయ రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి వెంకటమోహన్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కోడూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతుల సమన్వయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులలో చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తయారు చేసిన సేంద్రియ ఎరువుల రకాలను పరిశీలించారు.ఏ గ్రేడ్ పిఎండిఎస్ ఎటిఎం మోడల్స్‌ను పరిశీలించారు. బొజ్జావారిపల్లి పరిధిలోని రైతులు సాగు చేస్తున్న పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయంపై సమూల మార్పులు తీసుకురావాలన్నారు.

విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
విలేకరులు కావలెను

విశాలాంధ్ర కడప, అన్నమయ్య జిల్లాలో దిగువ పేర్కొన్న మండలాలలో
పనిచేయుటకు విలేకరులు కావలెను.
ఇంటర్‌మీడియట్ చదివి, తెలుగు భాషా పరిజ్ఞానం కలిగిన వ్యక్తులు అర్హులు.

పనిచేయవలసిన మండలాలు :

కమలాపురం, జమ్మలమడుగు, ఒంటిమిట్ట, దువ్వూరు, వి.యన్.పల్లి, వల్లూరు,
చక్రాయపేట, సిద్ధవటం, బద్వేల్ రూరల్, పెద్దముడియం, రాజుపాలెం, చాపాడు, గోపవరం,
బి.కోడూరు, సి.కె.దిన్నె, కాశినాయన, చిట్వేల్, పుల్లంపేట, చిన్నమండ్యం, కె.వి.పల్లి,
కలకడ, కురబలకోట, రైల్వేకోడూరు రూరల్, పీలేరు రూరల్,
తంబళ్లపల్లి, నిమ్మనపల్లి, పెనగలూరు, ఓబులవారిపల్లి, మదనపల్లి రూరల్

వివరాలకు: 99855 89444